# విద్యావ్యవస్థ పట్ల పాలకుల వైఖరి మారాలి...

ప్రభుత్వాలు మారినపుడల్లా రాష్ట్ర విద్యా వ్యవస్థ మార్పులకు లోనవుతూంది. ఎవరికి వారు తమ ఆలోచనలకు తగ్గట్టుగా మార్పులు చేస్తూ, గత ప్రభుత్వాలు విద్యను నిర్లక్ష్యం చేసాయని, తాము అధికారంలోకి వచ్చాక వ్యవస్థను గాడిన పెడుతున్నామని చెప్పకుంటున్నారు. ఇవన్నీ సహజంగానే కన్పించినా ఒక్కటి మాత్రం నిజం. రాష్ట్ర విభజన తర్వాత మన పాలకులు విద్యా వ్యవస్థపై ఎనలేని ఆసక్తి చూపిస్తున్నారు. ఎన్నడూ లేని ఆసక్తి ఇప్పుడే ఎందుకు? నిజంగానే మన పాలకులు ప్రజలంతా విద్యా వంతులు కావాలని కోరుకుంటున్నారా?

70వ దశకం వరకు మన రాష్ట్రంలో విద్యకు ప్రభుత్వాలు పెద్దగా ప్రాధాన్యత ఇచ్చింది లేదు. కనీసం ప్రాథమిక విద్యకు కూడా బడి అందుబాటులో లేని పరిస్థితి. ఉన్నత విద్య కావాలంటే మైళ్లకొలది దూరం పోవలసిందే. 80వ దశకం ప్రారంభమైన తర్వాత ప్రజలు విద్య యొక్క ప్రాధాన్యత గుర్తించడం మొదలు పెట్టారు. ప్రభుత్వాలు కూడా విద్యను ప్రభుత్వ రంగంలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తూనే, చదువులు చెప్పే గురువులకు సమాజంలో మంచి హోదా కల్పించే చర్యలూ చేపట్టాయి. అక్షరాస్యత ఉద్యమాల ప్రభావంతో విద్య యొక్క ప్రాధాన్యత ప్రజలు మరింతగా గుర్తించారు. ప్రతీ ఒక్కరూ తమ బిడ్డలు మంచి విద్య అభ్యసించాలని, జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరుకున్నవారే. ఈ నేపథ్యంలో పాఠశాలల స్థాపనకు, ఉపాధ్యాయులను నియమించే దానికి ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచవలసిన పరిస్థితి ఏర్పడింది.

కాని, 90వ దశకం ప్రారంభమైన తర్వాత వచ్చిన ప్రభుత్వాల ఆలోచనలు ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా మారాయి. ప్రభుత్వ విద్యపై పెరిగిన ఖర్చు తగ్గించుకునే పనిలో పడ్డాయి. ప్రభుత్వ బడులకు పోటీగా ప్రవేటు విద్యను ప్రోత్సహించాయి. నిబంధనలు సైతం సడలించి ప్రవేటు బడులను విస్తారంగా నెలకొల్పడాన్ని అనుమతించాయి. ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సౌకర్యాలు కల్పించకుండా, రెగ్యులర్ ఉపాధ్యాయు లను నియమించకుండా ప్రజలు ప్రవేటు బడులవైపు చూసేటట్లు చేసాయి. ముఖ్యంగా ఉన్నత విద్యారంగాన్ని ప్రవేటు విద్యా సంస్థల పరం చేసాయి. ఇప్పుడు 'పాఠశాల విద్య' వంతు వచ్చింది.

'జాతీయ విద్యా విధానం-2020' అమలు మాటున ప్రపంచ బ్యాంకు షరతులు అమలు చేసేందుకు గత ప్రభుత్వం యత్నించింది. పాఠశాలలకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామంటూనే ప్రాథమిక విద్యను రెండుగా చీల్చేందుకు పూనుకుంది. జిఓ 117 పేరుతో పాఠశాలల్లో ఉపాధ్యాయులను కుదించింది. మాతృభాషలో విద్యా బోధన లేకుండా చేసింది. యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసింది. 'అమ్మఒడి' పేరుతో పిల్లలను నచ్చినచోట చదివించుకోమంటూ డబ్బు ఇచ్చింది. ఫలితం, నేడు ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా ప్రవేటు పాఠశాలల్లో విద్యార్థులు పెరిగారు. క్రమంగా పాఠశాల విద్యకూడా ప్రవేటు పరమయ్యే పరిస్థితి నెలకొంది.

ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వ తప్పలు సరి చేస్తామంటోంది. పాత నిర్ణయాలను తిరగదోడి, కొత్త నిర్ణయాలు చేసేందుకు సిద్ధమౌతోంది. నాణ్యమైన విద్యనందించి ప్రభుత్వ విద్యను గాడిన పెడతామంటోంది. వినడానికి ఈ మాటలు బాగానే ఉన్నా, ఎన్ఇపి-2020 చట్రానికి భిన్నంగా ఆలోచించకుండా, ప్రపంచబ్యాంకు షరతుల నుండి బయటకు రాకుండా ఎలాంటి నిర్ణయం చేసినా అది 'పాత సీసాలో సారా కొత్త సీసాలో' పోసిన చందంగానే ఉంటుంది తప్ప ప్రభుత్వ విద్యారంగానికి ఎలాంటి మేలు చేకూర్చదు. పాఠశాలల కుదింపు, ఉపాధ్యాయుల తగ్గింపు, యాప్‌ల పేరుతో బోధనేతర పనులు గుప్పించడం వంటి విషయాల్లో పాలకుల వైఖరి మారకుంటే ప్రభుత్వ విద్యారంగానికి ఉరిత్రాడు బిగించినట్లే. ప్రజల మద్దతును కూడగట్టి విద్యారంగాన్ని, ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి.

ఐక్యఉపాధ్యాయ
విద్యా విషయక మాసపత్రిక

సంపాదక వర్గం

ఎన్.కుమార్ రాజా
ప్రధాన సంపాదకులు

సంపాదకవర్గ సభ్యులు
కె.ఎస్.ఎస్.ప్రసాద్
నక్కా వెంకటేశ్వర్లు
ఐ.ప్రసాదరావు
ఎం.జోగిరాజు
ఎం.లలితశ్రీ

ఈ సంచికలో...

పదవికాసం - 04
జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య సమాఖ్య... - 05
పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి ... - 07
ఓటరు నమోదుకు సూచనలు - 08
నిశ్శబ్ద స్ఫూర్తిదాత కొమ్మారెడ్డి కేశవరెడ్డి - 09
కోడూరు నారాయణ రావు - 11
పిల్లల రాజ్యంలో... ఎవరు మీరు - 12
పరిష్కార దిశగా మున్సిపల్ టీచర్ల సమస్యలు-13
యుటియఫ్ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు - 15
స్వర్ణోత్సవ రాష్ట్ర క్రీడోత్సవాల దృశ్యాలు - 17
స్వర్ణోత్సవ రాష్ట్ర స్థాయి క్రీడ విజేతలు - 21
ప్రశ్నోత్తరాలు - 22
16/24 సం॥ స్కేళ్ళు మంజూరుపై వివరణ - 23
ఉద్యమ వార్తలు - 24
ప్రభుత్వ ఉత్తర్వులు - 34

5 సం॥ చందా : ` 850-00
2 సం॥ చందా : ` 375-00
సం॥ చందా : ` 200-00

Union Bank Online
A/c No. 346402010025027
IFSC Code : UBIN0534641

ఐక్యఉపాధ్యాయ
యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి
గవర్నర్‌పేట, విజయవాడ-520002
Ph.No. : 0866-2973763
MobileNo. : 9494112533
Website : www.aputf.org
E-mail : ikyopadhyaya1975@gmail.com

PRINTED AND PUBLISHED BY KANDALA SATYA SUBRAHMANYA PRASAD, ON BEHALF OF A. P.UNITED TEACHERS FEDERATION, PRINTED AT PRAJASAKTI PRINTERS&PUBLISHERS PVT LTD, D.NO.27-30-4, AKULAVARI STREET, GOVERNERPET, VIJAYAWADA- 520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT A. P.UNITED TEACHERS FEDERATION, 27-31-11, PALAPARTHIVARI VEEDHI, GOVERNERPET, VIJAYAWADA.520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH. EDITOR : N. KUMAR RAJA

## పద వికాసం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 | 2 | | 3 | | 4 | | ■ |
| 5 | ■ | | ■ | | ■ | | ■ | 6 |
| 7 | | ■ | 8 | | | ■ | 9 | |
| | ■ | 10 | ■ | | ■ | 11 | ■ | |
| 12 | | | | ■ | 13 | | | |
| | ■ | | ■ | 14 | ■ | | ■ | |
| 15 | | ■ | 16 | | | ■ | 17 | |
| | ■ | 18 | ■ | | ■ | 19 | ■ | |
| | ■ | 20 | | | | | ■ | |

## ఆధారాలు

\- చక్రి

**అడ్డం**

1) ఈ యుద్ధంలో చాలా దేశాలు కమ్యూనిష్టు దేశాలుగా మారాయి
7) జబ్బుకు మరోపేరు
8) మరింతగా కోపం - పైత్యం ఎక్కువైంది
9) పిల్లలు ఊదే పీక
12) మానం కలిగినవాడు - మనిషే
13) చాలా స్పీడుగా అప్పజెప్పడం - గబ గబలాంటిది
15) చెడు వాసన
16) మన నాయకులకు ఇది ఉంటేనే వెలిగి పోతారు. లేకపోతే ఆగిపోతారు
17) 'అప్ప'ను పిలవండి
20) నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన గిరిజన నాయకుడు

**నిలువు**

2) తాను దూర సందు లేదు మెడకు ఇది ఎందుకు?
3) బాగా పోట్లాడుకొనే వాళ్లను ఈ పెంపుడు పక్షులతో పోల్చుతారు
4) ఉపాయం
5) ఈ రెండు నగరాలపై అమెరికా అణు బాంబులు వేసింది
6) దేశమంటే మట్టి కాదన్న మహా కవి
10) ఈ సాధు జంతువుల పేరుతో రాజకీయాలు
11) పడవ - మొదటి అక్షరం మారితే తగువు
14) ఈ వ్యవస్థలో మార్పు అవసరమా? అనవసరమా?
18) కింది నుండి పైకి 'అంగడి'
19) పప్పుతింటే గాయానికి ఇది పడుతుందని మూఢ నమ్మకం

(సమాధానాలు వచ్చే సంచికలో..)

**కవిత**

## బాలలం

\- ఈడే వెంకట భరతకుమారి తిరువూరు, ఎన్.టి.ఆర్.జిల్లా

బాలలం మేము బాలలం
సంతోషాల వెలుగులం
చాచానెహ్రూ నవ్వులం
ఎదలో నిలిచిన గులాబీలం
శాంతి కోరుకునే కపోతాలం
ప్రగతికి దివ్వెలం
ప్రతిభను సాధిస్తాం
భవిష్యత్ బంగారు కిరణాలం
అవని తోటలో చిరు నవ్వులం
జాతిమెచ్చే జాతి రత్నాలం
ఐక్యతకు మేమే ఆదర్శం
రేపటి పౌరులం
బాలలం మేము బాలలం

## పాఠకులకు సూచన

పూర్తి చేసిన పదవికాసం 2024 నవంబర్ 20లోగా ఐక్య ఉపాధ్యాయ పత్రికకు పోస్టు ద్వారా పంపాలి. కరెక్టుగా పూర్తి చేసి పంపిన పాఠకుల పేర్లు వచ్చే సంచికలో ప్రచురించ బడతాయి. సమాధానాలు పంపిన మొదటి పదిమందికి తగిన బహుమతి అందజేయబడుతుంది.

## గత అక్టోబర్ నెల సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 క | 2 ల | ■ | 3 సుం | ■ | 4 రో | త | ■ |
| 5 బ | ■ | 6 అ | న్న | ద | మ్ము | లు | ■ | 7 క |
| 8 స | 9 భా | ■ | ■ | ర | ■ | ■ | 10 అ | ల్లం |
| ■ | ర్యా | ■ | ■ | య్య | ■ | ■ | మ్మా | ■ |
| 11 అ | భ | య | ము | ■ | 12 ప | ల | నా | డు |
| ■ | ర్త | ■ | ■ | 13 వ | ■ | ■ | న్న | ■ |
| 14 ఆ | లు | ■ | ■ | రి | ■ | ■ | 15 లు | 16 పే |
| మ్మ | ■ | 17 అ | త్తా | కో | డ | 18 ళ్లు | ■ | రు |
| ■ | 19 చి | ప్ప | ■ | త | ■ | 20 గో | త్రం | ■ |

## పద వికాసం అక్టోబర్ నెల విజేతలు

1. **ఈడే వెంకట భరతకుమారి,** తిరువూరు, ఎన్.టి.ఆర్.జిల్లా
2. **కొత్త అరుణ,** బిక్కవోలు, తూర్పుగోదావరి
3. **పి.సాయిరాజు,** అమీనపురం, వీరంకిలాకు, కృష్ణా జిల్లా
4. **కె.వరప్రసాద్,** ఇ-మెయిల్
5. **జె.శివలీలా,** ఇబ్రహీంపట్నం, ఎన్.టి.ఆర్.జిల్లా
6. **ఎన్.భారతీ,** పెనుగంచిప్రోలు, ఎన్.టి.ఆర్.జిల్లా
7. **వై.కిశోర్,** పెనుగంచిప్రోలు, ఎన్.టి.ఆర్.జిల్లా
8. **ఏ.వి.ఆర్.శర్మ,** రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా
9. **యం.సుధాకర శర్మ,** కోట(మం), నెల్లూరు జిల్లా

విజేతలకు అభినందనలు. బహుమతి త్వరలో అందజేయబడుతుంది.




# జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి "ఒకే దేశం-ఒకే భాష" "ఒకే దేశం-ఒకే పన్ను" "ఒకే దేశం-ఒకే ఎన్నిక" లాంటి నినాదాలు పదే పదే వినిపిస్తున్నాయి. ప్రతి సందర్భంలో దేశమంతటా కేంద్ర ప్రభుత్వం తాను రూపొందించిన విధానాలను రాష్ట్రాలలో బలవంతంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఇప్పుడు దేశమంతటా జమిలి ఎన్నికల పేరుతో ప్రతిపాదన ముందుకు తెచ్చింది.

**జమిలి ఎన్నికలు అంటే ఏమిటి :**

దేశంలో లోక్‌సభ, అసెంబ్లీలతో పాటు స్థానిక సంస్థలు అయిన పంచాయితీలు, మున్సిపాలిటీలు సహా అన్ని రకాల సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడమే జమిలి ఎన్నికలు.

**జమిలి ఎన్నికలు సాధ్యమేనా :**

జమిలి ఎన్నికలు చట్టం రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఒక హై లెవెల్ కమిటీని నియమించింది. గత పార్లమెంట్ ఎన్నికలకు ముందే కమిటీ రిపోర్టు సమర్పించినా అమలుకు పూనుకో లేదు. ఇప్పుడు మూడవసారి అధికారంలోకి వచ్చిన వెంటనే రామనాథ్ కమిటీ చేసిన సిఫారసులను కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. వీటిని అధికార బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏతో పాటు మరికొన్ని పార్టీలు స్వాగతించినా ప్రతిపక్ష కాంగ్రెస్, వామపక్షాలు, డీఎంకే, టీఎంసీ, ఆప్‌తో పాటు మరికొన్ని ఎన్డీఏయేతర పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. మరికొన్ని తటస్థ వైఖరిని ప్రదర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికల ప్రయోజనాలు, నష్టాలతో పాటు వాటి అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించవలసి ఉంది.


కె.సురేష్‌కుమార్
యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు

స్వతంత్ర భారతదేశం గణతంత్ర రాజ్యంగా అవతరించిన తర్వాత 1951-52లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పుడు లోక్‌సభతో బాటు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా ఒకేసారి జమిలిగానే జరిగాయి. 1959లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగంలోని 356వ అధికరణాన్ని దుర్వినియోగం చేసి, కేరళలోని వామపక్ష ప్రభుత్వాన్ని రద్దు చేసింది. దీనితో ఒకేసారి కేంద్ర, రాష్ట్ర ఎన్నికలు నిర్వహించాలనే సంకల్పానికి ఆదిలోనే ఆటంకం ఎదురైంది. ఆ తర్వాత 1957, 1962, 1967 సం॥లలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కేరళ మినహా మిగిలిన రాష్ట్రాల ఎన్నికలన్నీ లోక్‌సభ ఎన్నికలతోబాటే జరిగాయి. 1971లో కాలపరిమితి ముగియకుండానే లోక్‌సభ రద్దు కావడంతో మధ్యంతర ఎన్నికల అవసరం ఏర్పడింది. ఆనాటి నుండి దేశవ్యాప్తంగా లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు కాకుండా ప్రత్యేకంగా నిర్వహించాల్సి వస్తున్నది. అయినా ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలతోబాటే జరుగుతున్నాయి. 1999 నుండి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలతోబాటే జరుగుతూండడం గమనార్హం.

అయినా, వివిధ కొత్త రాష్ట్రాల ఏర్పాటు, కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల రద్దు, సంకీర్ణ ప్రభుత్వాల వైఫల్యాలు, మరికొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ఎన్నికలకు వెళ్లడం వంటి సందర్భాలు మనం ఎన్నో చూసాం. అదీగాక స్థానిక సంస్థలైన గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలకు ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వాలు తలచుకున్నపుడే జరుగుతున్నాయి. వీటన్నిటి దృష్ట్యా జమిలి ఎన్నికలు సాధ్యం కావు.

**కేంద్రం చెబుతున్నదేమిటి :**

రాజ్యాంగం ప్రకారం ఒక ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం లేదా ద్రవ్య బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ఓడిపోయి సభ విశ్వాసం కోల్పోతే అది రాజీనామా చేయవలసి ఉంటుంది. ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని పక్షంలో మొత్తం సభను రద్దుచేసి మధ్యంతర ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. లోక్‌సభకు గాని, రాష్ట్రాల శాసన సభలకు గాని రాజ్యాంగంలో పదవీ కాలాన్ని నిర్ధేశించలేదు. ఆర్టికల్ 83(2) మరియు ఆర్టికల్ 172 (1) ప్రకారం లోక్‌సభ, శాసన సభల పదవీ కాలం "మధ్యంతరంగా రద్దు చేయబడకపోతే" ఐదేళ్ళపాటు ఉంటుందని పేర్కొంటున్నాయి. చట్ట సభల కాలాన్ని పొడిగించే ఏ ప్రయత్నమైనా రాజ్యాంగ విరుద్ధం మాత్రమేగాదు ప్రజాస్వామ్య వ్యతిరేకం కూడా. ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధుల ద్వారా ప్రజల సంకల్పమే నెగ్గాలి తప్ప మరో విధంగా కాదు.

నీతి ఆయోగ్ విడుదల చేసిన చర్చా పత్రంలో ఏదైనా అనుకోని పరిస్థితులలో లోక్‌సభ రద్దయితే మిగిలిన పదవీ కాలం రెండున్న ఏళ్ళలోపు ఉంటే రాష్ట్రపతి నియమించే మంత్రి మండలి మరియు కార్యనిర్వాహక అధ్యక్షుని ద్వారా నిర్వహించేందుకు ప్రతిపాదించ బడింది. అంతకంటే ఎక్కువ వుంటే ఎన్నికలు నిర్వహించబడతాయి. కాని, వాటి పదవీ కాలం మిగిలిన కాలానికే పరిమితమవుతుంది. అలాగే రాష్ట్ర శాసన సభ విషయంలో ప్రభుత్వం రద్దయితే గవర్నర్ ద్వారా రాష్ట్రాన్ని నడపవచ్చు. వీటన్నిటిని పరిశీలించినపుడు ఏ విధంగా చూసినా అధ్యక్షతరహా పాలనకే దారితీస్తుంది. ఇది ప్రజా స్వామ్యానికి ప్రమాదకరం.

ఇప్పటివరకు ఉన్న జాతీయ పార్టీలతో పాటు అనేక ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించినా రాష్ట్రాల ఎన్నికలు ప్రత్యేకంగా జరుగుతూ సమాఖ్య వ్యవస్థ పటిష్టంగా ఉన్నది. ఇప్పుడు బిజెపి తన దీర్ఘకాలిక అజెండాలో భాగంగా రాష్ట్రాల అధికారాలను కుదించడం, ఏదో ఒక రకంగా రాష్ట్రాలను తన ఏలుబడిలోకి తెచ్చుకోవడం వంటివి చేస్తూనే జమిలి ఎన్నికల పేరుతో సార్వత్రిక ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించి తాను భారీగా లబ్ధి పొందాలని చూస్తున్నది. ప్రాంతీయ పార్టీలను పాతరేసి సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా పార్లమెంటు జవాబు దారితనానికి వ్యతిరేకంగా అధ్యక్షతరహా పాలన తీసుకురావాలనే తన అజెండాను అమలు పరుస్తుంది.

### జమిలి ఎన్నికలతో ఆర్థిక భారం తగ్గుతుందా :

జమిలి ఎన్నికల వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని, హై లెవెల్ కమిటీ ద్వారా సిఫారసు చేయించారు. రాష్ట్ర అసెంబ్లీలకు, లోక్‌సభకు విడివిడిగా ఎన్నికలు జరగడం వల్ల ఆర్థిక వ్యయం పెరిగిందని, దీన్ని జమిలి ఎన్నికల ద్వారా తగ్గించవచ్చని, ఒకేసారి ఎన్నికలు జరిగితే ప్రభుత్వ యంత్రాంగాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని, అది ఓటర్లకు కూడా సౌకర్యవంతంగా ఉంటుందని, ఫలితంగా పోలింగ్ శాతం పెరుగుతుందని ఎన్నికల కోడ్ కష్టాలు ఉండవని కమిటీ చెబుతున్నది.

గతంకంటే ఎన్నికల వ్యయం పెరిగిన మాట వాస్తవమే. తొలి సాధారణ ఎన్నికలలో ప్రతి ఓటుకు చేసిన ఖర్చు 60పైసలు అయితే ఇప్పుడు రూ.46.40కు పెరిగింది. తొలి ఎన్నికలలో అభ్యర్థి ఎన్నికల ఖర్చు పరిమితి 25వేలు ఉంటే ఇపుడు 95 లక్షల వరకు పెంచారు. అలాగే 1998లో ఎన్నికల ఖర్చు 9వేల కోట్లు కాగా 2004లో అది రూ.లక్షా 35వేల కోట్లకు పెరిగినట్లు అంచనా.

ఎన్నికల ఖర్చే ప్రాతిపదిక అయితే ఎన్నికలు ఐదేళ్లకోసారి కాకుండా ఏ పదేళ్లకో, పాతికేళ్లకో నిర్వహించవచ్చు లేదా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు రద్దుచేసి అక్కడ గవర్నర్ ద్వారా పాలన చేయవచ్చు, స్థానిక సంస్థల ఎన్నికలు కూడా రద్దు చేస్తే మరింత ఖర్చు తగ్గుతుంది. కాని, ఇవన్నీ ప్రజాస్వామ్యానికి ముప్పు తెచ్చేవి. కాబట్టి ఎన్నికల వ్యయం తగ్గించుకునే మార్గాలు చూడాలి. ఒకవైపు మన ఆదాయం ఆకాశాన్ని అంటుతుంది అని చెబుతూ, లక్షల కోట్లలో బడ్జెట్ ప్రతి సంవత్సరం ప్రతిపాదిస్తూ ఎన్నికల వ్యయానికి మాత్రం భయపడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తామా? నిరంకుశాన్ని ఆశ్రయిస్తామా?

ఇక ప్రభుత్వ యంత్రాంగాన్ని సరైన ప్రణాళికాబద్ధంగా దశలవారీగా సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల వచ్చే నష్టమేమీ లేదు, అప్పటిదాకా అమలవుతున్న సంక్షేమ పథకాలేవీ ఆగిపోవు, కొత్త పథకాలు, తాయిలాలు ప్రకటించే అవకాశం రాజకీయ పార్టీలే కోల్పోతాయి. ప్రజాస్వామ్యం పట్ల, ఓటు విలువ పట్ల మరింత చైతన్యం కలిగిస్తే ఓటర్లు చైతన్యవంతంగానే ఎన్నికల్లో పాల్గొంటారని ఇటీవల నిరూపణ అయింది. ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల ఎన్నికల్లో జాతీయ అంశాలకే ప్రాధాన్యత ఉంటుంది. స్థానిక అంశాలపై చర్చ తగ్గుతుందని ఆందోళన దీన్ని వ్యతిరేకించేవారు వ్యక్తం చేస్తున్నారు.

### జమిలి ఎన్నికలు ఎవరికి ప్రయోజనకరం :

జమిలి ఎన్నికల్లో జాతీయ పార్టీలతో సమానంగా ప్రాంతీయ పార్టీలు ఖర్చులో పోటీ పడలేవు. దానివల్ల అవి ప్రచారంలో వెనుకబడే అవకాశం ఉంది. కనుక జమిలి ఎన్నికలు జాతీయ పార్టీలకే ప్రయోజనకరం. అందునా నరేంద్ర మోడీ హవా నడుస్తున్న ఈ సందర్భంలో అది బిజెపికే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

అదీగాక, లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగినప్పుడు 77% మంది ఓటర్లు రెండు ఓట్లు ఒకే పార్టీకి వేసినట్లు సర్వేలు తెలుపుతున్నాయి. ఈ రకమైన ధోరణి భారత దేశ పాలనలో రాజ్యాంగానికి ఆయువుపట్టు అయిన ప్రజాస్వామ్య, రాష్ట్ర ప్రయోజనాలు ఇమిడి ఉన్న సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది కేంద్ర ప్రభుత్వం యొక్క నియంతృత్వానికి, అధ్యక్ష తరహా పాలనకు దారితీస్తుంది. ఇంకా మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రధాన లక్షణం 'జవాబుదారితనం'. జమిలి వల్ల దారితీస్తున్న అధ్యక్ష తరహాపాలన జవాబుదారీతనాన్ని నులిమేస్తుంది. రాష్ట్రాలకు ఉన్న అధికారాలన్నీ నిరంకుశంగా కేంద్రానికి దఖలు పడతాయి.

రాజ్యాంగ విరుద్ధమైన ఈ ప్రతిపాదనలు అమల్లోకి రావాలంటే పెద్ద ఎత్తున రాజ్యాంగ సవరణ జరగాలి. దీనికి కోవింద్ కమిటీ 18 రాజ్యాంగ సవరణలు సూచించింది. ముఖ్యంగా లోక్‌సభ కాలావధి కంటే ముందే దానికదే రద్దయ్యే విషయం తెలిపే ఆర్టికల్ 83, లోక్ సభను రద్దు చేసేందుకు రాష్ట్రపతికి అధికారాలు కల్పించే ఆర్టికల్ 85, రాష్ట్ర శాసనసభల కాల పరిమితి నిర్ధారించే ఆర్టికల్ 172, రాష్ట్ర అసెంబ్లీల రద్దు చేసే అవకాశం కల్పించే ఆర్టికల్ 174 మరియు రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించేందుకు ఉద్దేశించిన ఆర్టికల్ 356 లను సవరించవలసి ఉంది. ఈ రాజ్యాంగ సవరణలు జరగాలంటే చట్టసభల్లో 2/3వంతు మెజారిటీ అంటే 543 స్థానాలున్న లోక్ సభలో 67% మరియు 254 సీట్లున్న రాజ్యసభలో 67% సభ్యులు సమర్థించాలి. అలాగే దేశంలోని సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదం తెలపాలి.

పార్లమెంట్‌లో బిజెపి బలం తగ్గిన నేపథ్యంలో మిత్రులు కలసి వచ్చినా మెజారిటీ సాధించడం కష్టం. కనుకనే 2026లో జమిలి ఎన్నికలు నిర్వహించడం ద్వారా తన లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులోనైనా ఈ కత్తి భారత పౌరులపై వేలాడుతూనే ఉంటుంది.

గనుక, ఏమైనా ఈ జమిలి ఎన్నికల పేరుతో వచ్చిన ఈ ప్రతిపాదనలన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై గవర్నర్‌ల పెత్తనాన్ని, కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని మరింత పెంచే విధంగా ఉన్నాయి. పలు భిన్నత్వాలున్న భారత్ వంటి విశాల దేశంలో కేవలం సమాఖ్య విధానం మాత్రమే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సుస్థిరం చేయగలదు. వేర్వేరు సమయాల్లో శాసనసభల ఎన్నికల నిర్వహణ అన్నది సమాఖ్య భావనలోని కీలక అంశం. అందుకే రాజ్యాంగం ద్వారా సంక్రమించి, అమలులో ఉన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడిచేలా చేసే ఎలాంటి ప్రయత్నాలనైనా ప్రజాస్వామ్య వాదులంతా తిప్పి కొట్టాలి.



## తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా

# శ్రీ బొర్రా గోపీమూర్తి

తూర్పు-పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గపు ఉప ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థిగా **శ్రీ బొర్రా గోపీమూర్తి** పోటీ చేస్తున్నారు. శ్రీ గోపీమూర్తి 14.04.1975వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం నార్నిమెరక పంచాయితీ గమళ్ళపేట గ్రామంలో సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు.

ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం పశ్చిమగోదావరి జిల్లా గమళ్ళపేటలోను, హైస్కూలు చదువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మట్లపాలెం గ్రామంలోను, ఇంటర్, డిగ్రీ భీమవరం డిఎన్ఆర్ కళాశాలలోను జరిగింది. ఏలూరు సిఆర్ రెడ్డి కాలేజీలో బిఇడి పూర్తి చేసారు. 1998 డిఎస్సిలో ఎస్‌జిటిగా ఎంపికై ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. ప్రస్తుతం అత్తిలి మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొమ్మరలో స్కూల్ అసిస్టెంట్ (గణితం)గా పనిచేయుచున్నారు. ఉపాధ్యాయ వృత్తి చేస్తూనే ఎంఎస్సి (మాథ్స్, కెమిస్ట్రి) ఎంఈడి పూర్తి చేయడమేకాక ప్రస్తుతం ఎంఎస్సి (ఫిజిక్స్) చదువుతున్నారు.

శ్రీ గోపీమూర్తి విద్యార్థిదశ నుండే చురుకుగా ఉద్యమాలలో పాల్గొన్న వారు. విద్యార్థుల సమస్యలపై, హాస్టల్ సమస్యలపై అనేక పోరాటాలు నడిపిన అనుభవం గోపీమూర్తికి ఉంది.

ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన నాటి నుండి యుటిఎఫ్‌లో సభ్యునిగా అన్ని స్థాయిలలో జరిగిన ఉపాధ్యాయ ఉద్యమాలలో ముందుండి పాల్గొన్నారు. అప్రెంటీస్, సిపిఎస్ రద్దు కొరకు జరిగిన అన్ని ఉద్యమాలలో కీలకపాత్ర వహించారు. సిపిఎస్ రద్దు కోసం ఇచ్ఛాపురం నుండి ప్రారంభమైన మోటారు సైకిల్ జాతాలో పశ్చిమగోదావరి మోగల్లు వరకు దాదాపు 1700 కి.మీ.లు మోటార్ సైకిల్‌పై విరామం లేకుండా పాల్గొన్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధానకార్యదర్శిగా ఆరేళ్ళ కాలం పనిచేసారు. 2021 నుండి రాష్ట్ర కార్యదర్శిగా ఉపాధ్యాయ ఉద్యమంలో చురుకైన పాత్ర వహిస్తున్నారు.

నిరంతరం ఉపాధ్యాయ సంక్షేమానికై పనిచేసిన గోపీమూర్తి ప్రథమ ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని యుటియఫ్ రాష్ట్ర సంఘం విజ్ఞప్తి చేస్తున్నది.

## ఐక్యఉపాధ్యాయ కథలు, కవితల పోటీ -2024

యుటియఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని సృజనాత్మక, అభ్యుదయ సాహిత్యాన్ని అభివృద్ధి పరచి పాఠకులకు అందించాలనే లక్ష్యంతో ఐక్యఉపాధ్యాయ "కథలు, కవితలు - 2024" పోటీ నిర్వహిస్తున్నది.

కథలు, కవితలు ..

* అభ్యుదయ, వర్తమాన, సామాజిక అంశాలకు సంబంధించినవై ఉండాలి.
* సామాజిక ప్రయోజనం కలిగిన ఏ అంశాన్నైనా కథా వస్తువుగా ఎంచుకోవచ్చు.
* కథ 'ఐక్యఉపాధ్యాయ' ప్రింటింగ్‌లో రెండు పేజీలకు (సుమారు 1000 పదాలు) మించకూడదు. ఏ4 సైజ్ పేపరుపై పేజీకి ఒకే వైపున వ్రాయాలి లేదా టైప్ చేయాలి.
* కవితలు గరిష్ఠంగా 30 లైన్లకు మించకూడదు.
* రచయితలు తమ రచనలు అనుకరణలు, అనువాదాలు, పేరడీలు, కాపీలు కావని ధృవీకరిస్తూ హామీ పత్రం జతచేయాలి.
* రచనలు 'ఐక్యఉపాధ్యాయ'కు పోస్టల్ ద్వారా మాత్రమే పంపాలి. ఫలితాలు ప్రకటించేవరకు వాటిని ఏ ఇతర పత్రికలకు పంపకూడదు.
* ఉత్తమ కథలకు, కవితలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రాష్ట్ర మహాసభలలో ఇవ్వబడతాయి. మరియు 'ఐక్య ఉపాధ్యాయ' పత్రికలో ప్రచురించడం జరుగుతుంది.
* మిగిలిన వాటిలో ప్రచురణకు స్వీకరించిన వాటిని సమయాను కూలంగా పత్రికలో ప్రచురించడం జరుగుతుంది. సమాచారం రచయితలకు ముందుగా అందించబడుతుంది.
* ఫలితాలు వెల్లడించిన అనంతరం ప్రచురణకు నోచుకోని కథలు, కవితలు రచయితలకు తిప్పి పంపడానికి తగిన కవరు, పోస్టల్ స్టాంపులు పంపించాలి. లేనిచో త్రిప్పి పంపబడవు.
* రచనతో పాటు ఫోటో, రచయిత చిరునామా, ఫోన్ పంపించాలి.
* రచనలు'ఐక్యఉపాధ్యాయ'కు చేరవలసిన చివరి తేదీ 2024 డిసెంబర్ 5.

### బహుమతులు

| కథలకు | | కవితలకు | |
|---|---|---|---|
| ప్రథమ బహుమతి | రూ. 5,000 | ప్రథమ బహుమతి | రూ. 1500 |
| ద్వితీయ బహుమతి | రూ. 4,000 | ద్వితీయ బహుమతి | రూ. 1000 |
| తృతీయ బహుమతి | రూ. 3,000 | తృతీయ బహుమతి | రూ. 500 |

**పంపవలసిన చిరునామా:** ప్రధాన సంపాదకులు, ఐక్యఉపాధ్యాయ, డో.నం.27-31-11, యుటియఫ్ కార్యాలయం, చెన్నుపాటి భవన్, పాలపర్తివారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520002.

# శాసనమండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదుకు సూచనలు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, తూర్పు-పశ్చిమ గోదావరి, కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలలో ఎన్నికలు జరుగు తున్నాయి. పోటీకి సంబంధించి జిల్లా కమిటీ అభిప్రాయాలు తీసుకోవడంతో బాటు ఎన్‌రోల్‌మెంట్ విస్తృతంగా చేయాలని నిర్ణయిం చడం జరిగింది.

గ్రాడ్యుయేట్ ఎన్నికలు జరిగే చోట ప్రజా సంఘాలతో కలసి జిల్లా స్థాయి వర్క్‌షాప్‌లు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 30 నుండి ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి ఈ క్రింది సూచనలు పాటించవలసిందిగా కోరడమైనది.

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్**

- పట్టభద్రుల నియోజకవర్గం ఓటరు నమోదు అక్టోబర్ 1 నుండి ప్రారంభమవుతుంది. ఓటరు నమోదుకు అర్హత ఉన్న పట్టభద్రులం దరూ ఓటు నమోదు చేసుకోవాలి. గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు కూడా కొత్తగా నమోదు చేసుకోవాలి. 2019లో నమోదు చేసుకున్న పాత ఓట్లన్ని రద్దయ్యాయి. దీనిని గమనంలో వుంచు కోవాలి.
- ఫారమ్ 18ని నింపి ఆ దరఖాస్తును నివాస అడ్రస్ ఆధారంగా ప్రభుత్వం నిర్దేశించిన మండల కార్యాలయాలు, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్స్ (కలక్టరేట్) కార్యాలయాలలో ఇవ్వాలి.
- ఓటరు నమోదు మొదటిదశ కార్యక్రమం 2024 అక్టోబర్ 1 నుండి ప్రారంభమై నవంబర్ 6వరకు జరుగుతుంది.
- 2021 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పాస్ అయిన వారందరూ ఓటరు నమోదుకు అర్హులు. అంటే 2024 నవంబర్ 1 నాటికి డిగ్రీ పాసై 3 సం॥లు పూర్తవ్వాలి.
- దరఖాస్తు ఫారమ్ 18తో పాటు డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీ జత చేయాలి. దానిపై సంతకం చేయాలి. ఆ తర్వాత గజిటెడ్ ఆఫీసర్ చేత అటెస్టేషన్ చేయించాలి. ఆఫీసర్‌చే Verified with Original and found correct అని రాయించాలి. గజిటెడ్ ఆఫీసర్ చేత అటెస్టేషన్ చేయించని పక్షంలో ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఓటరు నమోదు అధికారికి చూపించి ఓటు నమోదు చేసుకోవాలి. గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, హైస్కూల్ హెడ్ మాస్టర్లు (గజిటెడ్) అటెస్టు చేయవచ్చు.
- నివాస ధృవీకరణకు ఓటర్ కార్డు / ఆధార్ కార్డు / రేషన్ కార్డు (Residence Proof) కాపీ ఇవ్వాలి. ఓటరు నమోదు ఫారమ్ మీద దరఖాస్తుదారుడి యొక్క పాస్‌పోర్టు సైట్ ఫోటో తప్పక అంటించాలి.
- దరఖాస్తు ఫారమ్‌లో అసెంబ్లీ ఎన్నికల ఓటరు లిస్ట్‌లో ఉన్న దరఖాస్తుదారుని వివరాలు పొందుపర్చాలి. ముఖ్యంగా EPIC కార్డు (ఎలక్టోరల్ పాస్‌పోర్టు ఐడెంటికార్డు) నెంబర్ రాయాలి.
- వ్యక్తిగత దరఖాస్తులు బల్క్‌గా తీసుకోరు. అయితే, ఏదైనా సంస్థ నుండి (ఆ సంస్థ గవర్నమెంట్, ప్రైవేట్ అనే దానితో సంబంధం లేదు) బల్క్‌గా నమోదు చేసుకోవచ్చు. సంస్థ అధిపతి కవరింగ్ లెటర్ తప్పనిసరి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, సంస్థలు, కార్యాలయాల్లో ఉద్యోగం చేసే వారు ఆయా సంస్థలో సంబంధిత అధికారి ధృవీకరణ తో దరఖాస్తులు బల్క్‌గా ఓటరు నమోదు అధికారికి పంపించు కోవచ్చు.
- ఓటును ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చు. ceoandhra.nic.in (Chief Electoral Offier - Andhra Pradesh) NVSP (National Voter's Service Portal) అనే వెబ్‌సైట్‌లో వుంటుంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసే వారు ఆధార్ నంబర్, ఓటర్ ఐడి, ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి జతపరచాలి.
- ఓటరు నమోదు అధికారికి దరఖాస్తు ఇచ్చిన తరువాత రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. దానిని దరఖాస్తు దారునికి అందించాలి.
- మనం నమోదు చేయిస్తున్న పట్టభద్రుల ఓటర్స్ యొక్క వివరాలతో పట్టిక రూపంలో రిజిష్టర్ నిర్వహించాలి. అందులో వరుస నం., పేరు, చిరునామా, డిగ్రీ, ఫోన్ నం., ఇమెయిల్, ఎవరి ద్వారా నమోదు అయింది అన్న వివరాలు వుండాలి. నమోదు చేసిన వారి సెల్ నెంబర్ కూడా ఉండాలి. ఒక కాపీని బూత్ కమిటీ వద్ద భద్రపరచాలి. మరొక కాపీ జిల్లా కేంద్రం వద్ద ఉండాలి.

**టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్**

- ఉపాధ్యాయ నియోజకవర్గం ఓటరు నమోదు అక్టోబర్ 1 నుండి ప్రారంభమవుతుంది. ఓటరు నమోదుకు అర్హత ఉన్న ఉపా ధ్యాయులందరూ ఓటు నమోదు చేసుకోవాలి. గతంలో నమోదు చేసుకున్న ఓట్లు చెల్లవు. కొత్తగా నమోదు చేసుకోవాలి.
- ఫారమ్ 19ని నింపి ఆ దరఖాస్తును నివాస అడ్రస్ ఆధారంగా ప్రభుత్వం నిర్దేశించిన మండల కార్యాలయాలు, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్స్ (కలక్టరేట్) కార్యాలయాలలో ఇవ్వాలి.
- ఓటరు నమోదు మొదటిదశ కార్యక్రమం 2024 అక్టోబర్ 1 నుండి ప్రారంభమై నవంబర్ 6వరకు జరుగుతుంది.
- 2018 నవంబర్ 1 నుండి 2024 అక్టోబర్ 31 వరకు 6 సం॥ల కాలంలో 3 సం॥ల కాలం పనిచేసిన హైస్కూల్స్, కాలేజీలు, యూనివర్శిటిలలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు అందరూ టీచర్ ఓటరు నమోదుకు అర్హులు.
- దరఖాస్తు ఫారమ్ 19లో గల సర్వీస్ సర్టిఫికెట్‌ను సంబంధిత హెడ్మాష్టర్ / ప్రిన్సిపల్‌తో ధృవీకరణ చేయించి సమర్పించాలి.
- నివాస ధృవీకరణకు ఓటర్ కార్డు / ఆధార్ కార్డు / రేషన్ కార్డు (Residence Proof) కాపీ ఇవ్వాలి. ఓటరు నమోదు ఫారమ్ మీద దరఖాస్తుదారుడి యొక్క పాస్‌పోర్టు సైట్ ఫోటో తప్పక అంటించాలి.
- దరఖాస్తు ఫారమ్‌లో అసెంబ్లీ ఎన్నికల ఓటరు లిస్ట్‌లో ఉన్న దరఖాస్తుదారుని వివరాలు పొందుపర్చాలి. ముఖ్యంగా EPIC కార్డు (ఎలక్టోరల్ పాస్‌పోర్టు ఐడెంటికార్డు) నెంబర్ రాయాలి.
- వ్యక్తిగత దరఖాస్తులు బల్క్‌గా తీసుకోరు. అయితే, విద్యాసంస్థ నుండి ఇచ్చిన దరఖాస్తులు ఆ సంస్థ హెడ్మాష్టర్ / ప్రిన్సిపల్ కవరింగ్ లెటర్‌తో బల్క్‌గా నమోదు చేసుకోవచ్చు.
- ఓటును ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చు. ceoandhra.nic.in (Chief Electoral Offier - Andhra Pradesh) NVSP (National Voter's Service Portal) అనే వెబ్‌సైట్‌లో వుంటుంది.
- ఓటరు నమోదు అధికారికి దరఖాస్తు ఇచ్చిన తరువాత రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. దానిని దరఖాస్తు దారునికి అందించాలి.
- మనం నమోదు చేయిస్తున్న ఉపాధ్యాయ ఓటర్స్ యొక్క వివరాలు పట్టిక రూపంలో రిజిష్టర్ నిర్వహించాలి. అందులో వరుస నం., పేరు, చిరునామా, డిగ్రీ, ఫోన్ నం., ఇమెయిల్, ఎవరి ద్వారా నమోదు అయింది అన్న వివరాలు వుండాలి. నమోదు చేసిన వారి సెల్ నెంబర్ కూడా ఉండాలి. ఒక కాపీని బూత్ కమిటీ వద్ద భద్రపరచాలి. మరొక కాపీ జిల్లా కేంద్రం వద్ద ఉంచాలి.

## నిశ్శబ్ద స్ఫూర్తి ప్రదాత

# కొమ్మారెడ్డి కేశవ రెడ్డి



### మన ఉద్యమ నాయకులు

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఎపియుటియఫ్) మూల స్తంభాల్లో ఒకరు, దాదాపు ఒక దశాబ్ద కాలంపాటు (ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు) ఐక్యఉపాధ్యాయ మాస పత్రికకు ప్రధాన సంపాదకుడు, సంపాదకవర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించి, ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలోనూ, రచనా వ్యాసంగం లోనూ, స్వేచ్ఛాను వాదంలోనూ అందెవేసిన చేయి అయిన కొమ్మా రెడ్డి కేశవరెడ్డి.

**బాల్యము – విద్యాభ్యాసం :**

కొమ్మారెడ్డి కేశవరెడ్డి 1940వ సంవత్సరం సెప్టెంబర్ నెల 4న గుంటూరు జిల్లా గురజాల తాలూకా, అంబాపురం గ్రామంలో ఈశ్వరమ్మ, నరసారెడ్డిలకు ఆరో సంతానంగా జన్మించారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన కేశవరెడ్డిని నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు బాగా చదివించారు. ప్రాథమిక విద్య స్వగ్రామమైన అంబాపురంలోనూ, 6 నుంచి ఎస్ఎస్ఎల్సి వరకు వరకు గురజాలలోనూ, ఇంటర్మీడియేట్ నరసరావుపేటలోనూ, బిఎ డిగ్రీ కర్నూలులోనూ, ఉపాధ్యాయ శిక్షణ హైదరాబాద్ లోనూ పూర్తిచేసి సూర్యాపేటలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు.

**కుటుంబ జీవనం :**

వీరి వివాహం 1963లో హనుమాయమ్మ (సరోజిని)తో జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కేశవరెడ్డి ఉపాధ్యాయుడు కావడం, ఆయన వ్యక్తిత్వమూ, బోధనా సరళి పిల్లల విద్యాభ్యాసాన్ని బాగా ప్రభావితం చేసింది. అభ్యుదయ భావజాలాన్ని వంటబట్టించుకున్న కేశవరెడ్డి తన పిల్లల వివాహాలను కూడా వారందరి స్వచ్ఛంద అనుమతితో ఆదర్శంగా జరపడం వారి క్రియాశీలతకు (ఆచరణాత్మకత) నిదర్శనం. కేశవరెడ్డి పుస్తక పఠనము, అనువాదాలు, రచనలతో ఊపిరి సలపకుండా ఉన్నప్పుడు వారి భార్య ఆయనకు కావలసినవి అన్నీ సమకూర్చి ఏ లోటు రాకుండా చూసుకుంటూ సంపూర్ణంగా సహకరించేవారు. ఆయన రాసిన ప్రతి పుస్తకంలోనూ, ప్రతి అక్షరములోనూ ఆమె కృషి ఉన్న దనడంలో అతిశయోక్తి ఉండదని ఆ కుటుంబానికి సన్నిహితంగా మెలిగిన ప్రతి ఒక్కరూ చెప్పగలరు.

**ఉద్యోగ జీవితం :**

స్వంత జిల్లా గుంటూరుకు వచ్చి ఉద్యోగం చేయాలనే అభిలాష కొద్దీ అప్పటి ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు సూర్యాపేటలో ఉపాధ్యాయ బాధ్యతలు వదులుకొని గుంటూరు జిల్లా, రేపల్లెలో మరల నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. ఆ తరువాత దాచేపల్లికి బదిలీ అయి చాలాకాలం పాటు ఆ ఉన్నత పాఠశాలలో పనిచేసి పాఠశాల భౌతిక వనరుల పెంపుతో పాటు, అనేకమంది విద్యార్థులకు దిశానిర్దేశం చేయటమే గాక గ్రామస్థులకు వివిధ ప్రజా సంఘాల నాయకులకు, కార్యకర్తలకు తలలో నాలుకలా వ్యవహరించారు. అనంతరం పెదకూరపాడు, క్రోసూరు, నల్లపాడు, పెనుమాక గ్రామాల్లో స్కూల్ అసిస్టెంట్ గాను, నూతక్కి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి 1998 సెప్టెంబర్లో ఉద్యోగ విరమణ పొందారు. కేశవరెడ్డి ఎంతటి ధైర్యశాలి అంటే దాచేపల్లి పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు ఒక ఉపాధ్యాయుడు విద్యార్థిని మందలించాడని గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాఠశాల మీదకు రాగా విషయం తెలుసుకున్న ఆయన తరగతి గది నుండి బయటకు వచ్చి గ్రామస్తులను కంటి చూపుతో వారించి, ఒక్క మాటతో వారందరినీ వెనుకకు పంపిన ధీశాలి.

**సమాజ సేవ – ప్రజా సంఘాలకు సహకారం :**

కేశవరెడ్డి ఏ గ్రామంలో పనిచేసినా ఆయన ఇంటికి పిల్లలు వచ్చి ఉచితంగా శిక్షణ పొంది వెళ్లేవారు. కేశవరెడ్డి, రమాకాంతరావు ద్వయం పల్నాడు ప్రాంతంలో పేరొందిన గణిత ఉపాధ్యాయులు. విద్యార్థులకు కష్ట సాధ్యమనుకొనే గణితాన్ని సులభంగా బోధించడమే గాక, వారికి అనురక్తిని కలిగించి ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా సమాజ హితము కోరే విధంగా విద్యాబోధనకావించి వ్యాపార ధోరణులకు ఎదురొడ్డి నిలిచి ఎందరికో ఆదర్శప్రాయులయ్యారు. పనిచేసిన ప్రతి గ్రామంలోనూ గ్రామస్తులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలకు తలమానికంగా వుండి తన నిక్కచ్చి విధానాలతో రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరిస్తూ అందరినీ ఉత్తేజ పరిచేవాడు.

ఏ సమయంలోనైనా వారి ఇంటికి వెళ్ళిన ప్రజా సంఘాల కార్యకర్తలకు, నాయకులకు ఎంతటి ఆదరణ లభించేదంటే మరలా, మరలా వారి ఆతిథ్యాన్ని స్వీకరించి వారి ఆదరాభిమానాలు పొందాలనుకొనేవారు. వారు క్రోసూరులో నివాసమున్నప్పుడైనా, గుంటూరు బ్రాడీపేటలో నివాసమున్నప్పుడైనా, విజయవాడ, హైదరాబాద్‌లో

నివాసమున్నప్పుడైనా ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, జెవివి కార్యకర్తలు నిరంతరము వారి ఆదరాభిమానాలకు పాత్రులయ్యేవారు. ఆ కాలంలో బయట భోజన వసతులుగానీ, నివాస వసతిగానీ అంత సౌలభ్యంగా లేని రోజులు కావడమైతేనేమి అంతకంటే ఆ కుటుంబం, మరీ ముఖ్యంగా ఆయన సతీమణి సరోజిని గారి పాత్ర అద్వితీయం. ఇంటికి వచ్చిన వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలకు, అభ్యుదయకర శక్తులను, వ్యక్తులను ఆమె తన తోబుట్టువుల్లా, స్వంత పిల్లల్లా ప్రేమ, వాత్సల్యం చూపుతూ గోర్కీ నవల 'అమ్మ'లోని మాతృమూర్తి సాక్షాత్కరించేది.

కేశవరెడ్డి ఎక్కడ ఉన్నా తన రచనా వ్యాసంగానికే పరిమితం కాకుండా అన్ని ప్రజా సంఘాల కార్యకలాపాల్లో పాల్గొనే వారు, అందులో భాగమే కుమార్తె పద్మ, అల్లుడు ప్రతాప్ కాకినాడలో వుంటున్నప్పుడు వారింటికి వెళ్ళి (మనుమడు. పుట్టిన సమయంలో) ఎక్కువ కాలం ఉండాల్సి వచ్చింది. అప్పుడు తూర్పుగోదావరి జిల్లా అంతటా జరుగుతున్న కందుకూరి శతజయంతి ఉత్సవాల్లో అనేకచోట్ల ప్రధానవక్తగా పాల్గొనడమేగాక సంఘ సంస్కర్త కందుకూరి గూర్చి చిన్న పుస్తకము రాసి 10వేలమంది ప్రజలతో చదివింపచేశారు. ఆ తరువాత కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జరిగిన గురజాడ 150వ జయంతి ఉత్సవాలు, సాహితీ స్రవంతి కార్య కలాపాలు, సాహిత్య గోష్టులు మొదలైన వాటికి నిర్వాహకుడిగాను ప్రధాన సూత్రధారిగాను ఉండటమే కాకుండా చిన్న చిన్న పుస్తక ప్రచురణలకు కేంద్ర బిందువు అయ్యారు.

ఉద్యోగ ప్రారంభం నుండి ఉన్నత పాఠశాలల్లో పని చేయడమూ విద్యారంగానికి సంబంధించిన వారు కావడము వలన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)కు ఆయన ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది తన పిల్లలను విద్యార్థి ఫెడరేషన్‌లో పనిచేసే దానికి ఉత్సాహ పరచడమేగాక వారు నాయకత్వ బాధ్యతలకు ఎదిగేందుకు స్ఫూర్తినిచ్చారు.

**సాహిత్య అనువాద కార్యక్రమాలు స్వంత రచనలు :**

పువ్వు పుట్టగానే పరిమళించినట్లు బాల్యం నుండే కేశవరెడ్డి కళలు, సాహిత్యంపై ఆసక్తి చూపే వారు. తన చిన్ననాట గ్రామాల్లో జరిగే హరికథలు, బుర్రకథలు, తోలు బొమ్మలాటలు పౌరాణిక నాటకాలను ఆసక్తిగా చూసేవారు. ఆ కుతూహలమే వారికి సాహిత్యంపై మక్కువను పెంచడమే కాకుండా కళాశాల పత్రికల్లో ఛందోబద్ధ పద్యాలు, వచన కవితలు, కథలు వ్రాయడానికి ప్రేరణ నిచ్చింది. తదనంతర కాలంలో ఉద్యోగిగా వున్నప్పుడు సమాజంపై అవగాహన, విస్తృత అధ్యయనము వారిని సాహితీ ప్రపంచంలో ఉపాధ్యాయ ఉద్యమంలో సమున్నతునిగా నిలబెట్టాయి. ఆయన రచించిన పుస్తకాలు, చేసిన అనువాదాల గురించి మరొక్కమారు సవివరంగా సమీక్ష చేసుకోవచ్చు. అయితే నేటి సందర్భం ఆయన అంతటి కృషి చేయడానికి భూమిక ఏమిటి? ఇట్టి శ్రమకు ప్రేరణ ఏమిటి? అని పరిశీలిస్తే కేశవరెడ్డిగారిపై మహాకవి శ్రీశ్రీ, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, కొండవీటి గంటి కుటుంబరావు వంటి కవుల ప్రభావము చాలా ఎక్కువగా ఉంది. అందుకే ఆయన రచనలు గానీ, అనువాదాలు గానీ అన్నియు పీడిత, తాడిత ప్రజానీకానివే తప్ప, వేరొక రచనను చూడలేం. మంచి చదువరి అయిన కేశవ రెడ్డిని గోర్కీ సాహిత్యం ఎంతగానో ప్రభావితం చేయడమేగాక వర్గ చైతన్యాన్ని ద్విగుణీకృతం చేసింది. (మరీ ముఖ్యంగా గోర్కీ రాసిన ది సిటీ ఆఫ్ ఎల్లో డెవిల్ నవల). ఈ నవలను 1980లో 'నగరం' పేరుతో మొదటిసారి అనువాదంచేసి అనేకమంది పాఠకులను, విమర్శకులను, తెలుగు ప్రజలను చదివింపజేశారు. ఆ నవలలకు తెలుగులో ఆ పేరు పెట్టడంలోనే ఆయన ఔచిత్యం కనిపిస్తుంది. ఇంగ్లీషులో పుస్తకాన్ని ఆసాంతం చదివి ఆకళింపు చేసుకుని తన స్వేచ్ఛానువాదంతో ఎల్లప్పుడూ రచయిత మూల భావాన్ని కాపాడుతూ, పాఠకులకు అర్థమయ్యే భాషలో, ఆకర్షణీయం గా అనువాదం చేయడం కేశవరెడ్డి ప్రత్యేకత. పుస్తకము పేరు పెట్టడంలోనే కాదు విషయ సూచిక నుండి ముగింపు వరకు తన స్వేచ్ఛానువాదంలో ప్రత్యేక వరవడిని ఒడిదుడుకులు లేకుండా ఒకే బాణీలో కొనసాగించేవారు.

'నగరం'తో ప్రారంభమైన అనువాద కార్యక్రమం జీవిత చరమాంకం వరకూ కొనసాగి అనేక పుస్తకాలను తెనుగించినాడు. వాటిలో అతి ఎక్కువ భాగం పుస్తకాలను ప్రజాశక్తి బుక్ హౌస్ వారు ముద్రించారు. వాటిలో అనేక పుస్తకాలను చాలాసార్లు పునర్ముద్రించాల్సిన అవసరం కూడా ఏర్పడింది. అంటే దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆ పుస్తకాల ప్రామాణికతను, వాటి ప్రాసంగికతను, విషయ విజ్ఞానాన్ని అంతేగాక ఆయన స్వంత రచనలలో అతి ముఖ్యమైన పుస్తకములో 'భారతదేశ విద్యా చరిత్ర'ను ఎంతో శ్రమకోర్చి అనేక పుస్తకాలు, డాక్యుమెంట్లు, ప్రభుత్వ ఉత్తర్వులు చదివి, ఆకళింపు చేసుకొని సాధికారికంగా రాశారు.

నేటికీ ఆ పుస్తక ప్రామాణికత, విషయ పరిజ్ఞానము పరిశోధక విద్యార్థులకు సైతము ఉపయుక్తంగా ఉంది. కార్ల్ మార్క్స్ రాసిన "పెట్టుబడి' గ్రంథాన్ని, ఇ ఎం.ఎస్.నంబూద్రి పాద్ రాసిన భారత స్వాతంత్ర పోరాట చరిత్రను, బిపిన్ చంద్ర వ్రాసిన భారతదేశ చరిత్ర, భారత స్వాతంత్ర్య పోరాట గ్రంథాన్ని, మానవ సమాజ చరిత్రకు సంబంధించి ఎరిక్ హాబ్స్ బామ్ రచనలను భూలోకంలో శని, బొమ్మల్లో లెనిన్, మానవుడు సంపద – సమాజం మొదలైన పుస్తకాలను 30కిపైగా అనువదించి, తాను నమ్మిన సిద్ధాంత ప్రచారం చేస్తున్న 'ప్రజాశక్తి బుక్ హౌస్' జీవితాంతం పుస్తక ముద్రణకు సహకరించి వామపక్ష భావజాల వ్యాప్తికి తోడ్పడ్డారు. ఉద్యోగ విరమణ పొందిన రోజు నుంచి తన పూర్తి కాలాన్ని అధ్యయనానికి, రచనా వ్యాసంగానికి, అనువాద కార్యక్రమానికి అంకితం చేసిన మహనీయుడు కేశవరెడ్డి. తన రచనలలో, సాహిత్యంలో ఎవరైతే సమాజంలో పీడితులుగా ఉన్నారో వారికి పెద్ద పీటవేసి తన సామాజిక స్పృహను ప్రస్ఫుటపరిచిన మహావ్యక్తి.

**ఉపాధ్యాయ ఉద్యమంలో మమేకం :**

కేశవరెడ్డి పల్నాడు ప్రాంతంలో విశ్వనాథం, రమాకాంతరావులతో కలిసి అన్ని పాఠశాలలు కాలినడకన, సైకిళ్ళపై తిరిగి సంఘ

**(తరువాయి 9వ పేజీ)**

# కోడూరు నారాయణ రావు



మన ఉద్యమ నాయకులు

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ తొలి రాష్ట్ర అధ్యక్షునిగా, కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోడూరు నారాయణరావు విశేష సేవలు అందించారు. 1974 రాజమండ్రిలో ప్రథమ మహాసభలలో రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అప్పారి వెంకటస్వామి, మైనేని వెంకటరత్నం గార్లతో కలిసి యుటియఫ్ బలోపేతానికి కృషి చేసారు. సంఘ బలోపేతం కోసం అగ్రనేతలంతా హోల్ టైమర్లుగా స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ముందుకు వచ్చిన తరుణంలో తాను కూడా అదే బాటలో నడవాలని అనుకున్నప్పటికీ కుటుంబ కారణాల రీత్యా సాధ్యం కాకపోవడంతో 1980లో స్వచ్ఛందంగా రాష్ట్ర అధ్యక్షుని బాధ్యతల నుండి వైదొలగారు. అనంతరం 1980-82, 1986-90 కాలంలో రాష్ట్ర ఉపాధ్య క్షులుగా పనిచేసారు.

కోడూరు నారాయణరావు ఉపాధ్యాయుల సమస్యల పట్ల, నియమ నిబంధనల పట్ల మంచి అవగాహన కలిగిన నాయకుడు. వీరు రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కాలంలో ఖమ్మంలో జరిగిన ద్వితీయ మహాసభలలో ప్రత్యామ్నాయ విద్యా విధానం ప్రవేశ పెట్టబడింది. 1978 వేతన స్కేళ్ళలో టీచర్లకు ఎన్‌జిఓలకంటే మెరుగైన స్కేళ్ళు సాధించడంతోబాటు పదవీ విరమణ వయస్సు 58 సం॥లకు పెంపుదల విషయంలోనూ, ఉపాధ్యాయులకు చివరి వేతనంలో 50% పెన్షన్ సాధించడంలోనూ కృషి చేసారు. ఒక ప్రధానోపాధ్యాయిని సర్వీస్ నుండి తొలగించిన సందర్భంలో ఉపాధ్యాయులను పెద్ద ఎత్తున సమీకరించి విజయవాడ నగరంలో ధర్నా నిర్వహించారు. విజయవాడ నగరంలో ఉపాధ్యాయుల మొదటి ధర్నా అదే కావడం విశేషం.

తర్వాత 1980 నుండి 1986 వరకు 6 సం॥ల పాటు కృష్ణా జిల్లా ప్రధానకార్యదర్శిగా పనిచేసారు. వీరు కృష్ణా జిల్లా ప్రధానకార్యదర్శిగా పనిచేసిన కాలంలో 1986లో విజయవాడలో 4వ రాష్ట్ర మహాసభలు జరిగాయి. మహాసభల జయప్రదానికి మోటారు సైకిల్‌పై కృష్ణా జిల్లా అంతా పర్యటించి విరాళాలు ప్రోగుచేసి మహాసభలు అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వసూలైన సొమ్ము నుండి మహాసభలు నిర్వహించగా మిగిల్చిన 2లక్షల రూపాయలు రాష్ట్ర సంఘానికి జమ చేసారు. అనంతరం ప్రధానకార్యదర్శి బాధ్యతల నుండి కూడా వైదొలగి, తరువాత తరానికి బాధ్యతలు అప్పగించారు.

జీవితాంతం నిరాడంబరంగా వ్యవహరించడమే కాకుండా కృష్ణా జిల్లా ఉద్యమానికి, కార్యకర్తలకు మార్గదర్శకంగా నిలిచారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. 2011 మే 2న విజయవాడలో అంతిమశ్వాస విడిచారు.

## కొమ్మారెడ్డి కేశవరెడ్డి

కార్యక్రమాలు నిర్వహించటమేకాక, పూర్వ శాసన మండలిలో ఉన్న సమయంలో మాధవరావు, ఎం.జె.మాణిక్యారావు లాంటి ఉద్యమ అభ్యర్థులను గెలిపించేందుకు ఉద్యమ సహచరులైన విశ్వనాథం, రాయన్న, అంజిరెడ్డి, వై.ఎల్. రమాకాంతరావు తదితరులతో జిల్లాలలో మకాంవేసి ప్రచారం చేసేవారు. ఉపాధ్యాయులను కన్వెన్స్ చేసి గెలుపులో ముఖ్య భూమిక పోషించారు. అంతేకాదు శాసనమండలి పునరుద్ధరణ అనంతరం కె.ఎస్.లక్ష్మణరావు, బొడ్డు నాగేశ్వరరావుల గెలుపునకై తనవంతు విరాళం ప్రకటించి మంగళగిరి ప్రాంతంలో యువ కార్యకర్తలతో పాటు ప్రచారం చేసి వారందరిలో నూతనోత్తేజాన్ని నింపి గెలుపునకు బాటలు వేశారు. కేశవరెడ్డి ఉపన్యాసంలోని ప్రత్యేకత ఏంటంటే చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా, నిక్కచ్చిగా, నిర్మోహమాటంగా క్లుప్తంగా, విసిగించకుండా చెప్పి ఎదుటివారు ఎంతటి వారైనా ఒప్పించగలిగే సమర్థులు. అప్రెంటీస్ రద్దుకోసం జరిగిన 13 రోజుల సమ్మెలో ఉపాధ్యాయులను భాగస్వాములు చేయడానికి మంగళగిరి ప్రాంతంలోని అన్ని ఉన్నత పాఠశాలలను అక్కడి కార్యకర్తలతో పాటు తిరిగి సమ్మె సంపూర్ణంగా జయప్రదం కావడానికి ఎంతగానో శ్రమించి నూతన కార్యకర్తలకు ఆదర్శప్రాయుడయ్యారు. ఎందరో విద్యార్థులకు దార్శనికుడుగా వ్యవహరించారు.

**నిశ్శబ్ద స్ఫూర్తిప్రదాత :**

కేశవరెడ్డి అభ్యుదయకర సాహిత్యాన్ని తెలుగు ప్రజలకు అందిచండంలోనూ, వారి చైతన్య స్థాయిని, సామాజిక స్పృహను, స్ఫూర్తిని పెంపొందించేందుకు ఎంతగానో కృషి చేశారు. జీవితాంతం తన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేసి 2020 నవంబర్ 26న భౌతికంగా దూరమయ్యారు.

# పిల్లల రాజ్యంలో.. ఎవరు మీరు...





ఎన్.వెంకటేశ్వర్లు
యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు

పాపం, పుణ్యం, ప్రపంచ మార్గం/ కష్టం, సౌక్యం, శేషార్ధాలు ఏమీ ఎరగని పూవుల్లారా /మెరుపు మెరిస్తే/ వాన కురిస్తే/ ఆకాశమున హరి విల్లు విరిస్తే/ అవి మీకే అని ఆనందించే కూనల్లారా/ అచ్చటికో, ఎచ్చటికో ఎగురుతూ పోయే పిట్టల్లారా పిల్లలారా అని మహాకవి శ్రీశ్రీ తన శైశవగీతంలో చెప్తారు.

ఎంతో స్వేచ్ఛ జీవులు, అత్యంత ఆనందంగా, ఆహ్లాదంగా, పరిపూర్ణంగా కల్మషం లేని పిల్లల రాజ్యం లో వారే రాజు, వారే మంత్రి, వారే బంటు. వారు ఆడుకునే ఆటే పెద్ద క్రీడ. దానిలో తగువులుంటాయి, కొట్టుకోవటం ఉంటుంది. పది నిమిషాల్లో తీర్పులుంటాయి. శిక్ష ఉంటుంది. మళ్లీ కలిసి నడిచిపోతారు. ఆనందంగా చేయి చేయి కలిపి ముందుకు సాగుతా ఉంటారు. అలాంటి స్వేచ్ఛ రాజ్యంలోకి ప్రవేశించిన పెద్దలారా..ఇలా ఉండాలి? అలా ఉండాలని చెప్పడానికి నువ్వెవరు? నీకేం హక్కు ఉంది అని పిల్లలు అడిగితే పెద్దలు ఏం సమాధానం చెప్తారు.

ఎక్కడికి పోవాలన్నా, ఏ వస్తువుని తాకాలన్నా, ఏమి చేయాలన్నా, ఏమి చూడాలన్నా స్వేచ్ఛగా సంచరించే మా పిల్లలరాజ్యంలోకి ఇతర దేశస్తులు ప్రవేశించి గద్దించడం, నియంత్రించడం దురాక్రమణ కదా.. నేటి పెద్దలే ఒకనాటి పిల్లలు కదా. ఆనాడు మీకు స్వేచ్ఛ లేకుంటే ఇప్పుడు కూడా పిల్లలకు స్వేచ్ఛ లేకుండా చేయడం కరెక్టా. ఒకవేళ ఆనాడు మీకు స్వేచ్ఛ ఉంటే అలాంటి రెండంతల స్వేచ్ఛ ఇప్పుడు పిల్లలకి ఇవ్వాలి కదా.. పిల్లల రాజ్యంలోకి మనం ప్రవేశించి మన హక్కుల చుట్టూ మనం మాట్లాడి పిల్లల హక్కుల్ని హరిస్తున్నామేమో గమనించారా...

జిజ్ఞాస, ప్రశ్న, ఆసక్తి, పరిశీలన, స్వేచ్ఛ, కల్మషం లేని ఆలోచనలు, నవ్వడం.. పిల్లల హక్కులు. వీటికి ఎక్కడ ఆటంకం ఏర్పడితే అక్కడ కృత్రిమ మనిషిగా తయారవుతారు. ఆటంకం లేకపోతే ప్రకృతి సహజసిద్ధ పరిపూర్ణ మనిషిగా తయారవుతారు. ఏదైనా ఆట వస్తువు చేతికిస్తే పాడు చేస్తారని మనం అంటాం. కానీ ఆ వస్తువులో ఏమేమి ఉన్నాయో పరిశీలిస్తారనేది మనం తెలియజేసుకోవాలి.

ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వుండే సాధారణ హక్కులు బడిలోకి చేరాక లేదా సమాజంలోకి వచ్చాక ఆనాటి హక్కులు రద్దు కావడం లేదా పాక్షికంగా అమలుకాబడటం. సమాజం, బడిలో వుండే పెద్దలు మీద హక్కులు ఆధారపడటం చిత్రం లోకెల్లా విచిత్రం.

మరో ఆశ్చర్యకరమైన అంశం ఏమంటే గతంలో అనుభవించిన హక్కులు బడిలోకి వచ్చాక హక్కులతో సంబంధం లేని సిలబస్, కరికులం, అక్షరాలు, పదాలు, పద్యాలు లాంటి సముద్రం లో బలవంతాన నెట్టి ఈదమంటున్నారు. ర్యాంకుల పేరుతో తల కోసుకునే ఒత్తిడి పెట్టి, ర్యాంకుల పంజరంలో బంధించి, మానవత్వపు స్వేచ్ఛ గాలి సోకకుండా బంధించి వేస్తున్నారు.

నా వరకు చదువు అంటే చెప్పడం కాదు నేర్పడం. అందులోనే ఆనందం పొందుతాను అని జార్జి బెర్నార్డ్ షా అంటారు...చెప్పడం అంటే ఎదుటివారిని ప్రేక్షకులుగా, వినేవారిగా మార్చడం....నేర్పడం అంటే...చెప్పే వారు, వినే వారు కలిసి సంభాషించుకోవడం. ఈ ప్రక్రియ బడి బోధనలో, సమాజంలో జరగాలి.

1959లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ పిల్లల హక్కులుంటే స్వేచ్ఛగా నేర్చుకోవడం అని చెప్పింది. అంతర్జాతీయ మానవ హక్కులు చట్టం ప్రకారం జీవించే హక్కు, అభిప్రాయం చెప్పే హక్కు, రక్షణ పొందే హక్కు ఉండాలని చెప్పింది. అలాగే సమతుల్య ఆహారం, భయం నుండి విముక్తి, శరీరంపై యాజమాన్యం ఉండాలని చెప్పారు...

సమాజం తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పిల్లల హక్కుల్ని కాపాడే యంత్రాంగంలో ప్రధాన పాత్ర. రక్షణ, నివాసం, బస,భోజనం తల్లిదండ్రుల బాధ్యత. పోషక పదార్థాలు ఇచ్చే హక్కు, ఆరోగ్యం పొందే హక్కు, దోపిడీ లైంగిక వేధింపులు నుంచి రక్షణ సమాజం బాధ్యత.

బడికి రాకముందు పిల్లలకు ఎలాంటి స్వేచ్ఛగా వున్నారో దానిని కొనసాగిస్తూ అక్షరజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం, దృఢ స్వభావం ఆటుపోట్లను ఎదుర్కొనే మనస్తత్వం, నిజాయితీ, ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండటం, పరిసరాలను నిశిత దృష్టితో పరిశీలించడం, త్యాగ గుణాన్ని, ఎదుటి వారికి సహాయపడే మనస్తత్వాన్ని నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులది.

బడి వదిలిన తర్వాత పిల్లలు ఇంటికి ఆనందంగా కేరింతలు కొడుతూ పోతున్నారు. బడికి రావడానికి అంత ఆనందం, కేరింతలు ఏవి? ఉపాధ్యాయులుగా మనం కారణాన్ని వెతకాలి. పరిష్కారం కనుగొనాలి. బడి పిల్లల కనులలో మన స్వంత బిడ్డల కన్నులు కనబడాలి. తల్లి రక్షణ, తండ్రి ధైర్యం మన బడిలో వుండాలి.

బాలల దినోత్సవం అంటే చాక్లెట్లు బిస్కెట్లు మాత్రమే కాదు స్వేచ్ఛ వాతావరణం ఆహ్లాదకరమైన పరిసరాలను వారి దోసెట్లో పెట్టాలి. నూతన సమాజం మీదేనని భరోసా వారికి ఇవ్వాలి ఆ సమాజం నిర్మించడానికి దారి చూపాలి.

పరిష్కార దిశగా

# మున్సిపల్ టీచర్ల సమస్యలు



కె.ఎస్.ఎస్.ప్రసాద్
రాష్ట్ర ప్రధానకార్యదర్శి

మున్సిపల్ ఉపాధ్యాయులకు ఇతర యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులతో సమానంగా అన్ని ఉత్తర్వులు, సౌకర్యాలు కల్పించాలని అనేక పోరాటాలు జరిగాయి. 2016లో మున్సిపల్ టీచర్లకు సర్వీస్ రూల్స్ వచ్చినప్పటికి పిఎఫ్, డిడిఓ అధికారాలు, పోస్టుల అప్‌గ్రేడేషన్ వంటి కీలకమైన సమస్యలు పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలోనే మున్సిపల్ టీచర్ల సర్వీస్‌లను, పాఠశాలల పర్యవేక్షణను పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తీసుకువస్తూ 2022 జూన్ 24న జీవో 84 ప్రభుత్వం విడుదల చేసింది.

యుటిఎఫ్ చేసిన అనేక ప్రాతినిధ్యాలు, పోరాటాల ఫలితంగా 2022లో మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డి.డి.ఓ అధికారాలు ఇచ్చారు. యుపీ, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ పరిధిలోకి వచ్చారు. అయితే ఉపాధ్యాయులు, పాఠశాలల మ్యాపింగ్ సందర్భంగా జీతాల సమస్యలు ఏర్పడ్డాయి. మూడు నెలలు కష్టపడి ఉపాధ్యాయుల సర్వీస్ రిజిష్టర్లు అప్‌డేట్ చేయించడంతో బాటు జీతాల సమస్య యుటిఎఫ్ ప్రత్యేకంగా చేసిన కృషి వల్ల పరిష్కారమైంది.

మిగిలిన సమస్యల పరిష్కారానికి సర్వీస్ రూల్స్ ఆటంకంగా నిలిచాయి. వీటి కొరకు చేసిన కృషి ఫలితంగా 2024 ఫిబ్రవరిలో పాఠశాల విద్యాశాఖ జిఓ 7,8,9,10ల పేరుతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రేటర్ కార్పొరేషన్ల ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ విడి విడిగా ఇచ్చింది. ఈలోగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రమోషన్లు, బదిలీలు నిలిచిపోయాయి.

మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ ఆ,యా మున్సిపాలిటీల కమీషనర్లే నిర్వహించే వారు. జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల మాదిరి మున్సిపల్ టీచర్లకు పిఎఫ్ విభాగం ప్రత్యేకంగా లేదు. దీనికోసం జరిగిన పోరాటాల సందర్భంగా మున్సిపల్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరికీ ప్రత్యేకంగా మున్సిపల్ పిఎఫ్ నిర్వహించేందుకు డైరక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అంగీకరించింది. ప్రతిపాదనలు తయారు చేసి ఆర్థిక శాఖ ఆమోదానికి పంపారు. కాని, నిధులు కేటాయించకపోవడంతో ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. ఈ క్రమంలోనే జిపిఎఫ్ అమలు చేస్తే న్యాయం జరుగుతుందని మున్సిపల్ ఉపాధ్యాయుల డిమాండ్ ముందుకు వచ్చింది.

మున్సిపల్ ఉపాధ్యాయులు పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి వచ్చిన తర్వాత కమీషనర్లు నిర్వహించే ఖాతాలలో జమలకు గాని, విత్‌డ్రాయల్స్‌గాని అవకాశం లేకుండాపోయింది. ఈ సమస్యపై విద్యాశాఖ అధికారుల మీద తెచ్చిన ఒత్తిడి ఫలితంగా 2024 ఏప్రిల్ 1న నాటి పాఠశాల ప్రిన్సిపల్ సెక్రెటరీ, సిడిఎంఎ, ఏజీ, ఇతర అధికారులతో చర్చించారు. కాని, ఏజీ వారు స్థానిక సంస్థల ఉపాధ్యాయులకు జిపిఎఫ్ ఇవ్వటం సాధ్యం కాదని చెప్పారు.

జిల్లా పరిషత్ టీచర్ల మాదిరి మున్సిపల్ టీచర్ల పిఎఫ్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయడానికి మున్సిపల్ అధికారులే పూనుకోవాలని విద్యా శాఖ అధికారులు అంటున్నారు. మరోవైపు పాఠశాల విద్యాశాఖకు అప్పగించాం కాబట్టి దాని బాధ్యత వారే చూసుకోవాలి తప్ప తమకు సంబంధం లేదని మున్సిపల్ అధికారులు అంటున్నారు. ఈ విధంగా విద్యాశాఖ, మున్సిపల్ శాఖ సమస్యను పరిష్కరించకుండా ఒకరి మీద ఒకరు బాధ్యత నెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

ప్రభుత్వ, పంచాయితీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ యాజమాన్యాల ఉన్నత పాఠశాలలలో ఎస్‌జిటి, తత్సమాన పోస్టులన్నీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడేషన్ చేశారు. మున్సిపల్ హైస్కూల్స్‌లో మాత్రం పండిట్, పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేసారు తప్ప ఎస్‌జిటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయలేదు. యుటిఎఫ్ 2024 మార్చిలో ఇచ్చిన పోరాట నోటీస్ ఫలితంగా విద్యాశాఖ 1802 ఎస్‌జిటి పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు ప్రతిపాదనలు ఆర్థిక శాఖకు పంపింది. ఆర్థిక శాఖ తిరస్కరించడంతో ప్రతిపాదనలు మరుగునపడ్డాయి.

పాఠశాలల్లో సరిపడినంతమంది టీచర్లు లేకపోవడంతో హైస్కూల్స్‌లో సబ్జెక్టు టీచర్ల కొరత ఎక్కువగా ఉంది. ఎస్.జి.టి. ఉపాధ్యాయులే సబ్జెక్టు టీచర్లుగా బోధన చేయాల్సిరావటం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడి గురవుతున్నారు. సంవత్సరాల తరబడి బదిలీలు లేక ఒకే క్యాడర్, ఒకే ప్రదేశంలో ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. అర్బన్ ఎం.ఇ.ఓ. పోస్టులు మున్సిపల్ ఉపాధ్యాయులకు కేటాయించడం లేదు. 2017 నుంచి బదిలీలు లేవు. తక్షణం మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించాల్సి ఉంది.

అధికారులకు పదేపదే ప్రాతినిధ్యం చేసినా పరిష్కారం చేస్తామని చెప్పినా ఒక్క అడుగు కూడా ముందుకు పడని సందర్భంలో అనివార్యంగా మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం పోరుబాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖను డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ దశలవారీ పోరాటానికి పిలుపు ఇచ్చింది.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై పాఠశాల విద్యాశాఖ కమీషనర్ కార్యాలయం ఎదుట 24 గం॥ల ధర్నాకు యుటిఎఫ్ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో అక్టోబర్ 23న పాఠశాల విద్యాశాఖ కమీషనర్ యుటిఎఫ్ నాయకత్వాన్ని చర్చలకు ఆహ్వానించారు. చర్చలలో కొన్ని సానుకూల ఫలితాలు వచ్చాయి.

1. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సుమారు 550కు పైగా స్కూల్ అసిస్టెంట్, హెడ్మాష్టర్ పోస్టులు ఖాళీ ఉండగా వీటిలో దాదాపు 445 పోస్టులలో ప్రమోషన్లు ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ అంగీకరించింది.
2. 2023లో పాఠశాల విద్యాశాఖ జిఓ 117కు అనుగుణంగా

ప్రభుత్వ, పంచాయితీరాజ్, మున్సిపల్ పాఠశాలల్లో 4,949 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అవసరమవుతాయని అంచనా వేసింది. వీటిలో 68పోస్టులు ప్రభుత్వ, 3079 పంచాయితీరాజ్, 1802 మున్సిపల్ పాఠశాలలకు పోస్టులు అవసరమవుతాయని అంచనా వేసి ఆర్థిక శాఖ అనుమతికి ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత వచ్చిన కొత్త ప్రభుత్వం జిఓ 117 రద్దు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆర్థికశాఖ సదరు ప్రతిపాదనలు వెనక్కు పంపింది. ఇప్పుడు పాఠశాల విద్యాశాఖ జిఓ 117కు బదులుగా కొత్త ఉత్తర్వులు తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తున్నందున పాత ప్రతిపాదనల ప్రకారం పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు ఫైల్ పెట్టే అవకాశం లేకుండా పోయింది. నవంబర్‌లోగా కొత్త ఉత్తర్వులు తీసుకువస్తామని వాటి ప్రకారం మున్సిపల్ పాఠశాలల్లో ఎన్ని స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అవసరమవుతాయో లెక్కించి ఎస్‌జిటి పోస్టుల అప్‌గ్రేడ్‌షన్‌కు ఆర్థిక శాఖ అనుమతికి ప్రతిపాదనలు పంపుతామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇదే సందర్భంలో 192 పండిట్, పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలియజేసారు. సాధ్యమైనంత త్వరగా పోస్టుల అప్‌గ్రేడేషన్ పూర్తిచేసి ఆ పోస్టులను 2025 ఏప్రిల్‌లో ప్రమోషన్ల ద్వారా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

3. మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్‌కు సంబంధించి కొత్త విధానం అమలు అయ్యేవరకు పాత పద్ధతిలో కమీషనర్లు నిర్వహించే ఖాతాలలో పిఎఫ్ జమ చేయడానికి, అవసరాలకు కావలసిన సొమ్ము విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించడంపై సిడిఎంఏ వారితో డైరక్టర్ మాట్లాడడం జరిగింది. సమస్యను నోట్ రూపంలో పంపితే తగు చర్యలు తీసుకుంటానని సిడిఎంఏ చెప్పడంతో విద్యా శాఖ పిఎఫ్ సమస్యలపై ఒక నోట్ తయారు చేసి పంపింది. ఇదే సమస్యపై డిటిఏకు కూడా లేఖ వ్రాసి ట్రెజరీస్ పే బిల్‌లో డిస్‌ప్లే అయ్యే విధంగా చేసేందుకు విద్యాశాఖ అంగీకరించింది.

4. జిఓ 84 ప్రకారం గతంలో మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని యధాతథంగా పాఠశాలలకు కేటాయించాలని చర్చల సందర్భంగా విద్యాశాఖ డైరక్టర్ కోరడంతో వెంటనే చర్యలు తీసుకుంటామని సిఎండిఏ హామీ ఇచ్చారు.

5. అర్బన్ ప్రాంతాలలో మున్సిపల్ టీచర్లకు ఎంఇఓ-2 పోస్టులు కేటాయించేందుకు పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ సుముఖత వ్యక్తం చేసారు. దీనిపై ప్రభుత్వానికి అనుమతి కోరుతూ లేఖ వ్రాసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అట్లే కొన్ని కార్పొరేషన్లలో వున్న డివైఇఓ పోస్టులలో కూడా మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరగా విద్యాశాఖకు అప్పగించిన పోస్టులలో డివైఇఓ పోస్టులు అప్పగించలేదని తెలియజేసారు. పోస్టులు అప్పగిస్తే నిబంధనల ప్రకారం భర్తీ చేస్తామని తెలిపారు.

6. ప్రభుత్వ, పంచాయితీరాజ్ ఉపాధ్యాయులతో బాటు మున్సిపల్ టీచర్లకు కూడా కలిపి బదిలీ కోడ్ రూపొందిస్తున్నామని డైరక్టర్ తెలియజేసారు. నవంబర్ నెలాఖరు నాటికి బదిలీల కోడ్ రూపొందించి మే 31లోగా ఉపాధ్యాయులందరికి బదిలీలు తప్పనిసరిగా నిర్వహిస్తామని తెలియ జేసారు.

7. 1983-92 మధ్య రూ.398లు వేతనంపై నియామకం పొందిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు వర్తింపు, 2008 డిఎస్‌సి వారికి నోషనల్ ఇంక్రిమెంట్లు వర్తింపు ఫైల్ దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్నాయని డైరక్టర్ దృష్టికి తేగా వెంటనే వాటిని పరిష్కరించి ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశించారు.

మొత్తం మీద మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై కొంత కదలిక వచ్చింది. హామీలు ఇచ్చిన అధికారులు సమస్యల పరిష్కారానికి పూనుకుంటే వారిలో అసంతృప్తి ఉండేదికాదు. కనుక ఇప్పటికైనా అధికారులు సమస్యల పరిష్కారం పట్ల దృష్టి సారించాలి. లేకుంటే ఉపాధ్యాయుల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవలసి వుంటుంది. మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఎత్తిన పోరు జండా దింపేది లేదు.




## ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు

అన్నమయ్య జిల్లాలో చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, రాయచోటి మండలాలలో మోడల్ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయులను యుటియఫ్ సభ్యులుగా చేర్చుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్, మోడల్ స్కూల్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ ఆజాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను విస్తృతంగా చర్చించి వాటి పరిష్కారం కొరకు తగిన ప్రతిపాదనలు ఉపాధ్యాయుల నుండి తీసుకున్నారు. కరోనా సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక ప్రక్రియ చేపట్టేవరకు నిర్విరామంగా పోరాటం చేసి సాధిస్తామని హామీ ఇచ్చారు. అట్లే మోడల్ స్కూల్ సర్వీస్ రూల్స్, హెల్త్‌కార్డుల కోసం కృషి చేస్తామన్నారు. భవిష్యత్‌లో బదిలీలు పారదర్శకంగా జరిగేటట్లు ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.సాదిక్ అలీ ఖాన్, రాధాకృష్ణ, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# యుటియఫ్ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా యుటిఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు గుంటూరు నగరంలో అక్టోబర్ 4,5,6 తేదీలలో జరిగాయి. 4వ తేదీన ఎన్.టి.ఆర్. స్టేడియంలో క్రీడోత్సవాలు ప్రారంభ సమావేశం జరిగింది. తొలుత 26 జిల్లాల నుండి పాల్గొన్న ఉపాధ్యాయ క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. హాజరైన అతిథులు, రాష్ట్ర నాయకత్వం క్రీడావందనం స్వీకరించారు.

ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆటలు, వ్యాయామం జీవితంలో భాగం కావాలని, తద్వారా భావి భారత పౌరులైన విద్యార్థులను తీర్చిదిద్దటానికి కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే పేద విద్యార్థులను చదువుతో పాటు, ఆటల్లో తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగానికి నూతన విద్యా విధానం-2020 సవాలుగా మారిందన్నారు. కేరళ, తమిళనాడు ఎన్ఇపి అమలు చేయబోమని చెప్పాయని, కానీ ఎపిలో మాత్రం అత్యుత్సాహం గా అమలు చేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యని అందించడమే కాకుండా ఉపాధ్యాయులు ఇలా ఆటల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించటం అభినందనీయమని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఎపి జెఎసి చైర్మన్ కె.వి.శివారెడ్డి మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారా ఉద్యోగ ఉపాధ్యాయుల కార్మికుల సమస్యలను పరిష్కరించుకోగలమని చెప్పారు. ఎపి జెఎసి ఆవిధమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఉపాధ్యాయ ఉద్యమంలో యుటియఫ్‌కి ఒక ప్రముఖ స్థానం ఉందని అభినందించారు.

ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 ఏళ్లలో పోరాటలతోపాటు ఉపాధ్యా యుల్లో ఆట, పాటల నైపుణ్యాల పెంపుదల లక్ష్యంగా పని చేసిందన్నారు. విద్యారంగ వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యుటిఎఫ్ కృషి చేస్తుందన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగ వికాసం ఉపాధ్యాయుల సంక్షేమమే కాకుండా రాష్ట్ర ప్రజానీ కానికి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ప్రజానీకానికి తోడుగా నిలబడే ప్రజా సంఘంగా యుటిఎఫ్ పేరు గడించిం దన్నారు. కరువు సమయంలో గంజి కేంద్రాలు నడిపిన ఏకైక సంఘం, కోవిడ్లో రూ.3.5 కోట్లకుపైగా సేవా కార్యక్రమాలు చేపట్టిన సంఘం, వరద బాధితుల్ని ఆదుకున్న సంఘం యుటిఎఫ్ అని చెప్పారు. త్యాగాలతో హక్కులు సాధించిన పూర్వ నాయకుల స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పోరాటాల్లో అగ్రగామి సంస్థగా ఉపాధ్యాయుల విద్యార్థుల సమస్యల పరిష్కారంలో కీలక భూమికను పోషిస్తున్నామని తెలిపారు. స్వర్ణోత్సవాల వేళ గుంటూరులో క్రీడోత్సవాల నిర్వహించు కోవడం చాలా ఆనందంగా ఉందని తెలియ జేశారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు కె.జోజయ్య క్రీడల నిర్వహణకు రూ.50వేలు విరాళం సంఘానికి అందచేశారు. గుంటూరులో జరిగిన యుటిఎఫ్ రాష్ట్ర క్రీడోత్సవాలు 3 రోజుల పాటు ఉత్సాహంగా కొనసాగాయి.

మొదటి రోజు వివిధ క్రీడాంశాలు, అథ్లెటిక్స్‌లో పురుషులకు, మహిళలకు వేరు వేరుగా పోటీలు నిర్వహించబడ్డాయి. ఆటల పోటీలతోపాటు, పాటలు, ఉపాధ్యాయులు అభ్యుదయ, ఉద్యమ గేయాలు ఆలపించి ఉపాధ్యాయుల్ని ఉత్సాహపరిచారు. రెండో రోజైన 5వ తేదీ పోలీసు పెరెడ్ గ్రౌండ్, పిచ్చుకలగుంట,





కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి గ్రౌండ్స్‌లో క్రికెట్ పోటీలు జరిగాయి. జావెలిన్ త్రో, షటిల్ డబుల్స్, మెన్స్ షాట్‌పుట్, వాకింగ్, రన్నింగ్, మహిళల టెన్నికాయిట్, వాలీబాల్, స్లో సైక్లింగ్ ఈవెంట్స్ స్థానిక ఎన్.టి.ఆర్. స్టేడియంలో జరిగాయి. ఏ రోజు జరిగిన ఈవెంట్స్‌లో ఆ రోజు వారీగా విజేతలకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందచేశారు.

క్రికెట్ సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు జరిగాయి. గుంటూరు పిచ్చుకల గుంట గ్రౌండ్‌లో ఏలూరు, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో ఏలూరు జట్టు విజేతగా నిలిచింది. విజేతలను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ అభినందించారు. క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డును తిరుపతి జట్టు నుండి ఎన్.ఏడుకొండలు, బెస్ట్ బౌలర్‌గా ఏలూరుకు చెందిన దిలీప్, మ్యాన్ ఆఫ్ మ్యాచ్ శ్రీకాకుళం జట్టు హర్షకు అందజేశారు. మ్యాచ్ అనంతరం క్రీడల ముగింపు సందర్భంగా బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి అభినంద నలు తెలిపారు.

ముగింపు సభలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో క్రీడా నైపుణ్యాలు మెండుగా ఉన్నాయని, వాటికి మరింత అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

3 రోజుల పాటు రాష్ట్ర సంఘం నిర్వహించిన క్రీడోత్సవా లకు ఆతిథ్యం ఇచ్చిన గుంటూరు జిల్లా కమిటీని అభినందిం చారు. అన్ని ఈవెంట్స్‌లో విజేతలతోపాటు పాల్గొన్న క్రీడా కారులు అందరికి ప్రశంశా పత్రాలు అందజేసారు.

## ఎపి జెఎసి సెక్రటరీ జనరల్‌గా
## కెఎస్ఎస్ ప్రసాద్



**-12వ పిఆర్సి కమిషనర్ ను నియమించాలని డిమాండ్**

ఎపిజెఎసి సెక్రటేరియట్ సెక్రటరీ జనరల్‌గా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎపి ఎన్జీవో కార్యాలయంలో జెఎసి చైర్మన్ కెవి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన జెఎసి కార్యవర్గ సమావేశంలో సెప్టెంబర్ 29న ఈ ఎన్నిక జరిగింది. కో చైర్మన్లుగా ఎపిటిఎఫ్-1938 అధ్యక్షులు జి హృదయరాజు, ఎపిటిఎఫ్-257 అధ్యక్షురా లు సిహెచ్ మంజుల, ఆప్టా ప్రధానకార్యదర్శి కె ప్రకాష్‌రావు, వైస్ ప్రెసిడెంట్ ఎపి అగ్రికల్చర్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు సాయికుమార్ ఎన్నికయ్యారు.

12వ పిఆర్‌సి నూతన కమిషనర్‌ను వెంటనే నియమించాలని, ఆ నివేదిక సమర్పించేలోపు 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించి అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. పిఎఫ్, ఎపిజిఎస్ఐ రుణాల క్లయిమ్‌లు, సరండర్ లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ మంజూరు చేయాలని, 11వ పిఆర్‌సి, డిఎ బకాయిలు చెల్లించాలని, సిపిఎస్ ఉద్యోగులకు 11నెలల మ్యాచింగ్ గ్రాంట్ జమచేయాలని, పంచాయితీరాజ్ శాఖలో సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న 3వేల కారుణ్య నియామకాలు వెంటనే జరపాలని, గత ప్రభుత్వంలో నిర్వహించిన సమయంలో పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేయాలని సమావేశం కోరింది.

ఈ సమావేశంలో కో చైర్మన్లు ఎం రఘునాథరెడ్డి, చంద్రశేఖర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ చౌదరి పురుషోత్తం నాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# యుటియఫ్‌లో చేరికలు



కడప యుటిఎఫ్ భవన్‌లో అక్టోబర్ 18న జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన రెండు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలలో జిల్లా, మండల స్థాయిలో నాయకులుగా పనిచేస్తున్న ఈరి బాలజోజి, కె.ప్రసాద్, టి.జయ రాములు, ఎస్.ఆనందరావు, పి.ఎస్.వి.ప్రసాద్, బి.ప్రభాకర్, జి.బాల ఓబయ్య, ఎస్.సుమనయ్య తమ పదవులకు రాజీనామా చేసి యుటిఎఫ్‌లో చేరారు. యుటిఎఫ్‌లో చేరిన నాయకులకు జిల్లా శాఖ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించింది.

యుటిఎఫ్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఇతర ఉపాధ్యాయ సంఘాలలో పనిచేస్తున్న తాము యుటిఎఫ్ సిద్ధాంతాల పట్ల, విధానాల పట్ల ఆకర్షితులమై యుటిఎఫ్‌లో చేరామన్నారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పట్ల రాజీలేని సమరశీల పోరాటాలు చేస్తున్న యుటిఎఫ్‌లో చేరడం గర్వంగా ఉందన్నారు.

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు క్రియాశీలకంగా పనిచేసే నాయకులు యుటిఎఫ్‌లో చేరడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మరింత ఉత్సాహంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహా రావు, సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి, జిల్లా కార్యదర్శులు కె.చెన్నయ్య, ఎస్.ఎజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, జిల్లా మాజీ కార్యదర్శి కె.జోజయ్య, నాయకులు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణోత్సవ రాష్ట్ర స్థాయి క్రీడ విజేతలు

| వ. నం. | క్రీడ | పురుషులు / మహిళలు | రిజల్టు | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | ఫస్ట్ ప్లేస్ | జిల్లా | సెకండ్ ప్లేస్ | జిల్లా | థర్డ్ ప్లేస్ | జిల్లా |
| 1 | 400 మీ. వాకింగ్ (45 సం॥. పైబడి) | పురుషులు | జి. రామరావు | ఏలూరు | కె. నిరీక్షణరావు | బాపట్ల | కె.శ్రీనివాసరావు | పల్నాడు |
| | | మహిళలు | పి. రాజేశ్వరమ్మ | ఏలూరు | వి. కల్పన | ప్రకాశం | వి.కవిత | ప్రకాశం |
| 2 | 400 మీ. వాకింగ్ (45 సం॥. లోపు) | పురుషులు | జె. మల్లిఖార్జున | అనంతపురం | కె. శరణ్ మునీంద్ర | శ్రీసత్యసాయి | బి.శ్రీను | కాకినాడ |
| | | మహిళలు | జె.సుధారాణి | ఏలూరు | పి.శిరీష | నెల్లూరు | బి.ఇంద్ర | కోనసీమ |
| 3 | 100 మీ. వాకింగ్ (45 సం॥.పైబడి) | పురుషులు | కె. శివకోటేశ్వరరావు | ప్రకాశం | జి.రామరావు | ఏలూరు | వై. కృష్ణ | తిరుపతి |
| | | మహిళలు | కె. జగదీశ్వరీ | ప్రకాశం | ఎన్. పుష్పలత | ఏలూరు | వి. కవిత | ప్రకాశం |
| 4 | 100 మీ. వాకింగ్ (45 సం॥. లోపు) | పురుషులు | ఎం. సురేష్ బాబు | కోనసీమ | జి.దేవేంద్ర | చిత్తూరు | జి.సి.నరేష్ కుమార్ | శ్రీసత్యసాయి |
| | | మహిళలు | పి.పద్మజలక్ష్మి | ఏలూరు | ఎస్.కె.మెహిబూన్ | ప్రకాశం | బి.స్వరూప | నెల్లూరు |
| 5 | 200 మీ. వాకింగ్ (45 సం॥. లోపు) | పురుషులు | జి.దేవేంద్ర | చిత్తూరు | ఇ.ఆనంద్ | ఏలూరు | ఎం.హరికృష్ణ | కర్నూలు |
| | | మహిళలు | పి.పద్మ జయలక్ష్మి | ఏలూరు | ఎస్.కె.మహిబూన్ | ప్రకాశం | డి.వీరలక్ష్మి | కాకినాడ |
| 6 | షాట్‌పుట్ (45 సం॥. పైబడి) | పురుషులు | టి.సుబ్బారావు | బాపట్ల | డి.కోటేశ్వరరావు | గుంటూరు | టి. మల్లయ్య | ఏలూరు |
| | | మహిళలు | ఎం. మణెమ్మ | తిరుపతి | ఎస్.ఎ.ఎస్.జ్యోతి | కాకినాడ | జి.వి. గీతా పాల్ | నెల్లూరు |
| 7 | షాట్‌పుట్ (45 సం॥. లోపు) | పురుషులు | ఎం.బ్రహ్మయ్య | ప్రకాశం | ఎం.సురేష్ బాబు | కోనసీమ | ఎం.శ్రీనివాసరావు | గుంటూరు |
| | | మహిళలు | ఎస్.ఎ.మహిబూన్ | ప్రకాశం | ఎం.సృజన | ప్రకాశం | సిహెచ్.భవాని | కృష్ణా |
| 8 | జావలిన్‌త్రో (45 సం॥. పైబడి) | పురుషులు | కె.స్వామి | తూర్పుగోదావరి | టి.మల్లయ్య | ఏలూరు | పి.విజయరాజన్ | పశ్చిమగోదావరి |
| | | మహిళలు | కె.మీనా | తిరుపతి | పి.ఏ.మంగతాయరు | కోనసీమ | ఎం. మణెమ్మ | తిరుపతి |
| 9 | జావలిన్‌త్రో (45 సం॥. లోపు) | పురుషులు | ఎం.బ్రహ్మయ్య | ప్రకాశం | భీమరాజు | ఏలూరు | కె.జాకబ్ | బాపట్ల |
| | | మహిళలు | ఎస్.కె.రషీదా | పల్నాడు | ఎ.లావణ్య | బాపట్ల | సిహెచ్. భవాని | కృష్ణా |
| 10 | స్లోసైక్లింగ్ (45 సం॥. పైబడి) | పురుషులు | కె.స్వామి | తూర్పుగోదావరి | ఆర్.రవికుమార్ | ఏలూరు | ఎం.అమ్మనబాబు | కృష్ణా |
| | | మహిళలు | ఎస్.రాజేశ్వరి | కాకినాడ | కె.మీనా | తిరుపతి | సిహెచ్. సునంద | కృష్ణా |
| 11 | చెస్ | పురుషులు | ఎన్.ప్రసాద్ | ప్రకాశం | సిహెచ్.సాంబశివరావు | పల్నాడు | గోపాలకృష్ణా | తూర్పుగోదావరి |
| | | మహిళలు | పి.జోస్‌లిన్ | పశ్చిమగోదావరి | ఎస్.షబీభాను | శ్రీసత్యసాయి | జి.శిరీష | కృష్ణా |
| 12 | క్యారమ్స్ | పురుషులు | ఎ.ప్రశాంత్ & సిహెచ్.జిలానీ | బాపట్ల | ఎస్.మస్తానయ్య & సువర్ణరాజు | పల్నాడు | | |
| | | మహిళలు | కె.ప్రసన్న & ఎన్.వహీదా | నెల్లూరు | ఎస్.సుధారాణి & కె.రామలక్ష్మి | ఏలూరు | | |
| 13 | షటిల్ బ్యాడ్మింటన్ (సింగిల్స్) | పురుషులు | ఎం.శ్రీనివాసరావు | విజయనగరం | ఎస్.శ్రీనివాస | మన్యం | గజేంద్ర | చిత్తూరు |
| | | | | | | | ఖాదర్ మస్తానయ్య | పల్నాడు |
| | | మహిళలు | ఎస్.కె.రషీదా బీ | పల్నాడు | ఎన్.విజయశాంతి | ఏలూరు | పి.పద్మా | ఏలూరు |
| | | | | | | | స్వర్ణవాహిణి | కృష్ణా |
| 14 | షటిల్ బ్యాడ్మింటన్ (డబుల్స్) | పురుషులు | పి.ఖాదర్‌మస్తాన్& జె.శ్రీకాంత్ | పల్నాడు | శ్రీనివాసరావు & ఎ.వి.ఎస్.జి.యోగేష్ | విజయనగరం | ఎస్.బాజీ & సతీష్ | కోనసీమ |
| | | | | | | | పి.మురళీకృష్ణ & ఉదయ్ | కోనసీమ |
| | | మహిళలు | రషీదా బీ&రమాదేవి | పల్నాడు | విజయశాంతి&రామతులసీ | ఏలూరు | పుష్పలత & రేవతి | ఏలూరు |
| | | | | | | | సబీభాను & సీతారత్నం | శ్రీసత్యసాయి |
| 15 | వాలీబాల్ | పురుషులు | | చిత్తూరు | | శ్రీకాకుళం | ........ | ........ |
| | | మహిళలు | | పల్నాడు | | ఏలూరు | ........ | ........ |
| 16 | త్రోబాల్ | మహిళలు | | తూర్పుగోదావరి | | కోనసీమ | ........ | ........ |
| 17 | టెన్నికాయిట్ | మహిళలు | | ఏలూరు | | కోనసీమ | ........ | ........ |
| 18 | బాస్కెట్‌బాల్ | పురుషులు | | పశ్చిమగోదావరి | | పల్నాడు | ........ | ........ |
| 19 | క్రికెట్ | పురుషులు | | ఏలూరు | | శ్రీకాకుళం | ........ | ........ |

# ప్రశ్నోత్తరాలు



E-Mail Id ikyopadhyaya1975@gmail.com
నిర్వహణ : టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు
రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు గత సంవత్సరం 24 సం॥ల సర్వీస్ పూర్తి చేసారు. ఇటీవల డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లు ఉత్తీర్ణు లయ్యారు. వారికి 24 సం॥ల స్కేలు ఎప్పటినుండి ఇస్తారు?

**- కె.లక్ష్మీనారాయణ,** శ్రీకాకుళం

**జవాబు** : జిఓ ఎంఎస్ నం.270 జిఏడి తేదీ.30.04.1984 ప్రకారం చివరి పరీక్ష మరుసటి రోజు నుండి ఇంక్రిమెంట్ మంజూరు చేస్తారు.

**ప్రశ్న** : ఒక ఉద్యోగి రిటైర్‌మెంట్ మూడు నెలల ముందు శిక్షగా 3 ఇంక్రిమెంట్లు రద్దు చేసారు. అయితే అప్పటికే వేతన నిర్ణయం, దానిపై పెన్షన్ నిర్ణయించారు. ఇంక్రిమెంట్ల రద్దు వలన చెల్లించిన అదనపు మొత్తాన్ని గ్రాట్యూటీ నుండి రికవరీ చేసారు. చేయవచ్చా?

**-బి.ఎన్.మూర్తి,** ఏలూరు

**జవాబు** : ఇంక్రిమెంట్ల మొత్తాన్ని రికవరీ చేయరాదు. రికవరీ చేయవచ్చనే నిబంధన పెన్షన్ రూల్ 9 (7)(ఎ)ను జిఓ ఎంఎస్ నం.955 ఆర్థిక; తేదీ.21.12.2022 ప్రకారం రద్దు చేసారు. పై అధికారులకు రిప్రజంట్ చేయండి.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు స్టడీ లీవులో ఉన్నారు. స్టడీ లీవులో ఉండగా ఇంక్రిమెంట్ మంజూరు చేయవచ్చా?

**- చి.శ్రీరామకృష్ణ,** ఒంగోలు

**జవాబు** : సెలవు అనంతరం ఆయన విధులలో చేరిన తేదీ నుండి ఆర్థిక లాభం వర్తించే విధంగా మంజూరు చేయవచ్చును.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయిని చనిపోయిన బిడ్డను ప్రసవించారు. ప్రసూతి సెలవు వర్తిస్తుందా?

**- కె.వి.రమణ,** అనంతపురం

**జవాబు** : డైరక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు ఎల్.డిస్. నం.1941/జి2/90; తేదీ.11.06.1990 ప్రకారం చనిపోయిన బిడ్డను ప్రసవించినా ప్రసూతి సెలవు వర్తిస్తుంది.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయిని భర్త చనిపోవడం వలన ఆమెకు ఫ్యామిలీ పెన్షన్ వస్తోంది. ఆమె రెండవ పెళ్లి చేసుకుంటే ఆ పెన్షన్ వస్తుందా? ఆగిపోతుందా? ఆమెకు ఇద్దరు పిల్లలు.

**- కె.విశ్వేశ్వర చారి,** నెల్లూరు

**జవాబు** : ఈ ఉపాధ్యాయిని విషయంలో పునర్వివాహం అయిన తదుపరి కుటుంబ పెన్షన్ నిలిపివేయ బడుతుంది.

**ప్రశ్న** : సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ కొరకు డిఎస్‌సి రాయాలనుకుంటే ఉన్నతాధికారుల అనుమతి అవసరమా?

**- ఎస్.కాంతారావు,** తెనాలి

**జవాబు** : అవును. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయుడు ఏ పరీక్ష రాయాలన్నా ఉన్నతాధికారుల అనుమతి అవసరము. ఆ విధంగా అనుమతితో డిఎస్‌సి వ్రాసి ఎంపికైతే విధుల నుండి రిలీవైతే పాత సర్వీస్‌కు, సెలవులకు రక్షణ వుంటుంది.

**ప్రశ్న** : ఉద్యోగి మరణించినప్పుడు భార్య / భర్తకు కారుణ్య నియామకమునకు వయో పరిమితి నిబంధన ఏమైనా ఉందా?

**- పి.నాగేశ్వరరావు,** బాపట్ల

**జవాబు** : ఉద్యోగి మరణించినప్పుడు భార్య / భర్తకు కారుణ్య నియామకం ఇవ్వవలసిన సందర్భంలో గరిష్ట వయో పరిమితి 45 సంవత్సరములు.

**ప్రశ్న** : హారిజంటల్ రిజర్వేషన్ అంటే వివరించగలరు.

**- బి.ఎస్.నారాయణ,** చిత్తూరు

**జవాబు** : హారిజంటల్ రిజర్వేషన్ అంటే ఆ,యా కమ్యూనిటీలలో ఆయా వర్గాలకు ప్రత్యేక రోస్టర్ పాయింట్లు ఉండవు. రిజర్వేషన్ పరిమితిని కూడా విడిగా చూడటం జరగదు. ఆ కమ్యూనిటీ మొత్తంలో సదరు శాతంమంది వున్నారా లేదా అనేది మాత్రమే చేస్తారు.

## పాఠకుల అభిప్రాయాలు పంపండి

"**ఐక్యఉపాధ్యాయ**" మాసపత్రిక ఉపాధ్యాయ సమస్యలు, ఉద్య మాలతో పాటు అనేక సామాజిక, ఆర్థిక, అకడమిక్ అంశాలపై వ్యాసాలు ప్రచురిస్తోంది. కథలు, కవితలతోపాటు పలు శీర్షికలు నిర్వహిస్తోంది. వీటిపై పాఠకుల ప్రతిస్పందనను ఆహ్వానిస్తున్నది. పత్రికలో ప్రచురితమైన అంశాలపై మీ అభిప్రాయాలు మరియు ఏఏ అంశాలు వుంటే బాగుంటుందో మా దృష్టికి తీసుకు వస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. మీ అభిప్రాయాలు క్లుప్తంగా, సూటిగా ఉత్తరాల ద్వారాగానీ, మెయిల్ ద్వారాగానీ తెలియజేయగలరు.

**ఉత్తరాల ద్వారా:** "**ఐక్యఉపాధ్యాయ**" యుటియఫ్ ఆఫీస్, 27-31-11, పాలపర్తి వారివీధి, గవర్నరుపేట, విజయవాడ-520002.

ఇ-మెయిల్: **ikyopadhyaya1975@gmail.com**కి పంపవచ్చు.

**- సంపాదకవర్గం**

# 16/24 సం॥ స్కేళ్ళ మంజూరుపై వివరణ



కె.ఎస్.ఎస్.ప్రసాద్
రాష్ట్ర ప్రధానకార్యదర్శి

ప్రమోషన్ అవకాశాలు లేక సుదీర్ఘకాలం ఒకే పోస్టులో పనిచేసిన ఉద్యోగులకు 10 సం॥ల సర్వీస్ పూర్తి చేసిన వారికి స్పెషల్ గ్రేడ్ స్కేల్, 15 సం॥ల సర్వీస్ పూర్తి చేసిన వారికి స్పెషల్ ప్రమోషన్ పోస్ట్ స్కేల్ (SPP-I) మంజూరు చేసేలా ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ 1981లో ప్రవేశ పెట్టబడింది. స్పెషల్ గ్రేడ్ స్కేల్ పొందడానికి ఎలాంటి అదనపు విద్యార్హతలు అవసరం లేదని, SPP-I స్కేల్ పొందడానికి మాత్రం డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ కావాలనే నిబంధన విధించారు. తర్వాత కాలంలో 22 సం॥లు సర్వీస్ పూర్తి చేసిన వారికి 2వ ప్రమోషన్ పోస్టుకు అవసరమైన అర్హతలు ఉంటే ఆ పోస్టుకు సమానంగా SPP-II స్కేల్ కూడా మంజూరు చేయవచ్చునని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

01.12.1982నుండి ఉపాధ్యాయులకు రీగ్రూపింగ్ స్కేళ్ళు వర్తింపజేసిన తర్వాత ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయడంతో ఉపాధ్యాయుల వేతనాల్లో గణనీయమైన మెరుగుదల వచ్చింది. ఉద్యోగులకంటే ఉపాధ్యాయులకు వేతనం ఒక స్టేజ్ పైన ఉండడంతో సమాజంలో ఒక స్టేటస్ కలిగిన ఉద్యోగంగా ఉపాధ్యాయ వృత్తి మారిపోయింది.

ఆనాటి నుండి ప్రతి పిఆర్‌సి సందర్భంలో ఆ,యా వేతన సవరణ సంఘాల సిఫారసు మేరకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. ఉద్యోగ సంఘాల కోరిక మేరకు 1993 పే స్కేల్స్‌లో 10,15,22 సం॥ల స్కేళ్ళకు బదులుగా 8,16,24 స్కేళ్ళు ప్రవేశ పెట్టబడ్డాయి.

సాధారణంగా SPP-I, SPP-II స్కేళ్ళు పొందే నాటికి ఉద్యోగులు ఆ,యా పోస్టులకు సంబంధించిన విద్యార్హతలు సాధించడంతోబాటు నిర్దేశించిన డిపార్ట్‌మెంట్ టెస్టులు ఉత్తీర్ణులై ఉండాలి. పూర్తిస్థాయి అర్హతలు వున్నవారికే ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ వర్తింప జేయాలన్నది ప్రభుత్వ ఉత్తర్వులలో నిర్దేశించబడింది. కొందరు సకాలంలో డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ కాలేకపోవడంతో వారు టెస్టులు పాసైన నాటి నుండి స్కేల్ వర్తింపజేస్తూ డ్రాయింగ్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చేవారు.

16/24 సం॥లు సర్వీస్ పూర్తి అయ్యే నాటికి డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ కాకుండా, తర్వాత కాలంలో టెస్టులు పాస్ అయిన వారికి ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ వర్తింపజేయడంపై 2010లో విశాఖపట్నం ట్రజరీస్ డిప్యూటీ డైరక్టర్ లేవనెత్తిన సందేహంపై నాటి ఆర్థిక శాఖ కార్యదర్శి వివరణ ఇస్తూ అర్హతలు లేని కారణంగా ప్రమోషన్ పొందలేకపోయిన ఉద్యోగికంటే అతని జూనియర్ ముందుగా ప్రమోషన్ పొందినప్పుడు, సదరు ఉద్యోగి తర్వాతి కాలంలో డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ కావడం ద్వారా అర్హతలు సాధించినట్లయితే, టెస్టులు పాస్ అయిన నాటి నుండి ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ వర్తింపజేయడం కరెక్ట్ కాదని వివరణ ఇస్తూ ఒక ఉదాహరణ ఈ క్రింది విధంగా పేర్కొనడం జరిగింది.

**ఉదాహరణ :** ఆర్.కేశవరావు అనే ఉద్యోగి మొదట 13.11. 1972న కాపీయిస్టుగా సర్వీస్‌లో చేరి 22.01.1975న టైపిస్టుగా ప్రమోషన్ పొందారు. టైపిస్టు కేడర్‌లో 16 సం॥ల సర్వీస్ 24.01. 1991 నాటికి పూర్తి చేయగా, ఆనాటికి నిర్దేశించిన డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ కాని కారణంగా అతనికి SPP-I స్కేల్ మంజూరు చేయలేదు. తర్వాత కాలంలో ఆయనకంటే జూనియర్ అయిన మరో ఉద్యోగి ప్రమోషన్ పొందడం జరిగింది. కాగా, కేశవరావు 30.11.2008న డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్‌కావడం జరిగింది. డ్రాయింగ్ అధికారి కేశవరావుకు 24.01.1991 నుండి SPP-I స్కేల్ మంజూరు చేస్తూ డిపార్ట్‌మెంట్ టెస్టులు పాసైన 30.11.2008 నుండి మానిటరీ బెనిఫిట్ ఇచ్చారు. ఇలా ఇవ్వడం సరికాదు అని పేర్కొన్నారు.

పైన పేర్కొనిన విధంగా క్లారిఫికేషన్ ఇచ్చినప్పటికీ రాష్ట్రమంతటా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వారు డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ అయిన నాటి నుండి ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ వర్తింప జేయడం జరుగుతున్నది. కాని, క్లారిఫికేషన్ ఆధారం చేసుకుని విశాఖ జిల్లాలో కొన్ని ప్రాంతాలలో డిపార్ట్‌మెంట్ టెస్టులు సకాలంలో పాస్ కాలేదనే నెపంతో ఉద్యోగులకు, ఉపాధ్యా యులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ నిలుపుదల చేయడం జరిగింది.

దీనిపై 2019లో డైరక్టర్ ఆఫ్ ట్రజరీస్‌కు యుటియఫ్ ప్రాతినిధ్యం చేయగా అప్పీలును తిరస్కరించడమే కాక సకాలంలో డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ కానివారికి ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ మంజూరు చేయరాదంటూ రాష్ట్రమంతటా అమలు చేసారు. దీనివల్ల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నష్టపోవడం జరిగింది. సెకండరీ గ్రేడ్, తత్సమాన స్థాయి ఉపాధ్యాయులు ముఖ్యంగా పండిట్లు, పిఇటిలు, డ్రాయింగ్ టీచర్లు వంటివారు బాగా ఇబ్బంది పడ్డారు.

ఈ విధానం సరికాదని, ఆర్థిక శాఖ కార్యదర్శి క్లారిఫికేషన్‌ను పున:పరిశీలించి తగు న్యాయం చేయాలని అధికారులకు పలు మార్లు ప్రాతినిధ్యం చేయడం జరిగింది. అయినప్పటికి గత ప్రభుత్వ హయాంలో ఈ సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల యుటియఫ్ రాష్ట్ర నాయకత్వం ముఖ్యమంత్రి దృష్టికి సమస్య తీసుకువెళ్ళడంతో అధికారులలో కదలిక వచ్చింది. సకాలంలో డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ కాని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయడంలో ఉన్న ఇబ్బందులను తగ్గిస్తూ 2024 అక్టోబర్ 10న డైరక్టర్ ఆఫ్ ట్రజరీస్ ఉత్తర్వులు జారీ చేసింది.

They are therefore informed that there is no bar on the appointment of an employee to SPP Scale I-A/SPP Scale IIA from the date of acquiring the requisite qualifications for the promotion post, even such date is after completion of 12/24 years as the case may be, subject to the conditions mentioned below

**(a)** The employee has not forfeited his opportunity for promotion earlier due to not acquiring the requisite qualifications for the promotion post.

**(b)** The employee hasn't relinquished promotion earlier.

పై ఉత్తర్వుల ప్రకారం 16/24 సం॥ల సర్వీస్ పూర్తి చేసే నాటికి నిర్దేశించిన అర్హతలు సాధించని ఉద్యోగులకు వారు అర్హతలు సాధించిన నాటి నుండి SPP-I, SPP-II స్కేళ్ళు మంజూరు చేస్తారు. అయితే

1) ప్రమోషన్ పొందే నాటికి అర్హతలు లేని కారణంగా ప్రమోషన్ వదులుకోరాదు.

2) ప్రమోషన్ రిలింక్విష్ చేయరాదు.

ఈ ఉత్తర్వులు కొంత ఉపశమనం కలిగించేవిగా ఉన్నాయి. సకాలంలో డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ కాలేకపోయినా పాస్ అయిన నాటి నుండి స్కేళ్ళు పొందే అవకాశం ఉద్యోగులకు లభించింది.